DATE: 14-07-2022 RNI NO : TELTEL/2021/81092

ప్రజా మంటలు

తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి(Volume) : 3
సంచిక(Issue) : 91

పేజీలు - 08
వెల: రూ 5/-

ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

prajamantalu.com

గురువారం 14 జూలై, 2022

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



తెలంగాణ పాలిసెట్ ఫలితాలు విడుదల 2లో



వరదలను పట్టించుకోని సీఎం కేసీఆర్ విమర్శలు కాదు.. సమస్యలపై చర్చించాలి 2లో



# ప్రమాదంలో కడెం ప్రాజెక్టు

## ప్రాజెక్టు కు పోటెత్తిన వరద 17 గేట్ల ద్వారా దిగువకు విడుదల

- రెడ్ అలర్ట్ జారీచేసిన అధికారులు
- పరిస్థితిపై సీఎం కేసీఆర్ ఆరా
- భారీ వర్షాలతో కడెం ప్రాజెక్టుకు వరద
- సామర్థ్యానికి మించి వచ్చి చేరుతున్న నీరు
- 17 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- కడెం వద్దే మకాం వేసిన మంత్రి ఇంద్రకరణ్
- కడెం ప్రాజెక్టు పరిస్థితిపై మంత్రికి సీఎం ఫోన్
- నిండుకుండలా మూసీ ప్రాజెక్ట్
- ఆరుగేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- కాళేశ్వరానికి భారీగా వరద తాకిడి
- మేడిగడ్డలో 85 గేట్లు, సరస్వతీ బ్యారేజీలో 62 గేట్లు ఎత్తివేత
- నిండుకుండలా హుస్సేన్ సాగర్
- ఒక్క గేటు ఎత్తి దిగువకు నీటి విడుదల
- భద్రాచలం వద్ద పెరిగిన వరద
- మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- తడిసి ముద్దయిన ఉమ్మడి వరంగల్ జిల్లా
- ఏజెన్సీలో వర్షాలతో జనజీవనం

**నిర్మల్,జూలై13:** నిర్మల్ జిల్లాలో గత కొద్ది రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాల దెబ్బకు కడెం ప్రాజెక్టు కు వరద పోటెత్తింది. కడెం ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నీటిమట్టం చేరడంతో అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కడెం ప్రాజెక్టు వద్ద పరిస్థితిపై తెలంగాణ సీఎం కేసీఆర్ ఆరా తీశారు. కడెం ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్న నేపథ్యంలో పరిస్థితిని సీఎం అడిగి తెలుసుకున్నారు. కడెం ప్రాజెక్టుకు ఎగువ నుండి 5 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చి చేరుతుంది. అయితే కడెం ప్రాజెక్టుకు చెందిన 17 గేట్ల ద్వారా సమారు రెండున్నర లక్షలకు పైగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు మరో గేటు మాత్రం తెరుచుకోలేదు. దీంతో అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే.. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మిగతా 2లో..

## తక్షణ చర్యలు

# తీసుకోండి

విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం లేకుండా చూడాలి

ముంపుప్రాంతాల్లో ప్రజలను ఖాళీ చేయించాలి

మంత్రులు ఎక్కడిక్కడే ఉండి సమీక్షించాలి

జిల్లాల్లో పరిస్థితులపై ఆరా తీసిన సీఎం కేసీఆర్

వరదపరిస్థితులపై మరోమారు సమీక్షించిన సీఎం



- రాష్ట్రంలో రెడ్ అలర్ట్ ప్రకటించిన వాతావరణశాఖ
- పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరిక
- ఇప్పటికే పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- నిండుకుండల్లా గోదావరి తీర ప్రాజెక్టులు
- పాఠశాలలకు మరో మూడు రోజులు సెలవులు పొడిగింపు
- పలు యూనివర్సిటీల పరిధిల్లో పరీక్షలు వాయిదా
- భారీ వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దు
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు హెచ్చరిక
- భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ
- హైదరాబాద్‌లో పాతభవనాలను గుర్తించి నోటీసులు ఇచ్చిన జీహెచ్ఎంసీ

**హైదరాబాద్,జూలై13:** రాష్ట్రంపై వరుణుడి ప్రకోపం కొనసాగుతోంది. భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తమైంది.కొన్ని రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలన్నీ జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎటు చూసినా వర్షపు నీరే కనిపిస్తోంది. వరద పోటెత్తుతుండటంతో ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. ఇన్ ఫ్లో అంతకంతకూ పెరుగుతుండటంతో కొన్ని జలాశయాలు ప్రమాదం అంచుకు చేరాయి. బసార, నుంచి మొదలు గోదావరి తీరం అంతా వరదతో ముంచెత్తుతోంది. ధర్మపురిలో గోదావరి పొంగి గ్రామంలోకి నీరు చేరింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తడిసి ముద్దయ్యింది.
హైదరాబాద్‌లోనూ ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే మిగతా 5లో..

## కొత్త రైల్వే లైన్‌కు మోక్షం

- ₹2,798 కోట్లతో నిర్మాణం
- ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్

**న్యూఢిల్లీ,జూలై13:** రెండు రాష్ట్రాలు.. మూడు ఆధ్యాత్మిక ప్రాంతాలను కలుపుతూ ప్రతిపాదిత కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదం తెలిపింది. రూ.2,7,98.16 కోట్ల అంచనా వ్యయంతో 116.65 కి.మీల మేర తరంగా హిల్-అంబాజీ-అబు రోడ్డు రైల్వే లైన్‌ను మిగతా 2లో..



## శ్రీలంకలో ఆగని ఆందోళనలు

దేశంలో ఎమెర్జన్సీ విధించిన ప్రభుత్వం

పలుచోట్ల కర్ఫ్యూ విధిస్తూ ఆదేశాలు

తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ప్రధాని

తీవ్ర సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న శ్రీలంకలో పరిస్థితి పూర్తిగా అదుపుతప్పింది. నిరసనకారులు ప్రభుత్వంపై వ్యతిరేక గళాన్ని బలంగా వినిపిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పడంతో బుధవారం అక్కడి ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించింది. ఆందోళనల నేపథ్యంలో అధ్యక్షుడు గొటబాయ రాజపక్స కుటుంబంతో సహా దేశం విడిచి మాల్దీవులకు పారిపోయారు. మాల్దీవుల్లోనూ గొటబాయ రాజపక్సకు నిరసన సెగ తగిలింది. పదుల సంఖ్యలో శ్రీలంక పౌరులు నిరసన తెలిపారు. గొటబాయకు మాలే సురక్షితమైన ప్రాంతం కాకూడదని డిమాండ్ చేశారు. శ్రీలంక ప్రభుత్వానికి ఈ విషయాన్ని తెలిపాలని అక్కడి ప్రజలను కోరారు. శ్రీలంక జాతీయ జెండాలు, ప్లకార్డులతో రాజపక్సకు వ్యతిరేకంగా ఆందోళనకారులు నినాదాలు చేశారు.

**కొలంబో,జూలై13:** శ్రీలంకలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. దేశంలో అత్యవసర పరిస్థితిని విధిస్తున్నట్టు ప్రధాని రణిల్ విక్రమసింఘే బుధవారం ప్రకటించారు. ఆందోళనకారులను అరెస్ట్ చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. తానే తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. అధ్యక్షుడు గొటబాయ రాజపక్స దేశం విడిచి పారిపోయారనే వార్తలు వెలువడగానే మిగతా 5లో..

## ఉచితంగా బూస్టర్ డోస్




- 75 రోజుల పాటు బూస్టర్‌డోస్
- బూస్టర్ డోస్‌పై కేంద్రం కీలకనిర్ణయం
- 15 నుంచి అందిరికీ ఉచితంగా వ్యాక్సిన్

**న్యూఢిల్లీ,జూలై13:** కరోనా వ్యాక్సిన్ కు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 18 ఏండ్లు పైబడిన వారందరికీ ఉచితంగా బూస్టర్ డోస్ ఇవ్వాలని నిర్ణయించింది. జులై 15 శుక్రవారం నుంచి 75 రోజుల పాటు బూస్టర్ డోస్ డ్రైవ్ కొనసాగుతుందని స్పష్టం చేసింది. దేశంలో గతేడాది మిగతా 5లో..

## ప్రజానాడి




## తెలంగాణ సమాజం యావత్తు

# జాగరూకతతో ఉండాలి



దేశంలో మతం మత్తుమందులాగా తయారైంది

రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖా మంత్రి కేటీఆర్

**హైదరాబాద్,జూలై13:** మత్తు మందులాగా దేశంలో మంతం తయారైందని రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖా మంత్రి కేటీఆర్ అన్నారు. నగరంలోని గ్రోత్ కారిడార్ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ లక్ష్మణ్ సంపాదకత్వంలో వెలువరించిన చరిత్రపుటల్లో తెలంగాణ గ్రంథాన్ని కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ సమాజం మిగతా 5లో..

## ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే

# మళ్లీ గులాబీదే అధికారం



- ఓ సర్వేలో వెల్లడైన నిజాలు
- కేసీఆర్‌కు తగ్గని ప్రజాదరణ
- 49శాతం ప్రజాదరణ పొందిన కేసీఆర్
- జాతీయ సర్వేలో 11వ ర్యాంక్
- సీఎన్ఓఎస్ సర్వేలో వెల్లడి
- ప్రథమ స్థానంలో ఒడిసా సీఎం నవీన్ పట్నాయక్

**హైదరాబాద్,జూలై13:** తెలంగాణలో రాజకీయ పరిణామాలు మారిపోతుండటంతో.. అధికారం ఎవరికి దక్కుతుందనే దానిపై ఎవరి అంచనాలు వాళ్లు వేసుకుంటున్నారు. గతంలో పోల్చితే తెలంగాణలో బీజేపీ బాగా బలపడటం, కాంగ్రెస్ కూడా పుంజుకునేందుకు ప్రయత్నిస్తుండటంతో.. మరోసారి టీఆర్ఎస్‌కు అధికారం దక్కుతుందా ? లేదా ? అనే సందేహాలు మొదలయ్యాయి. అయితే ఇప్పటికిప్పుడు ఎన్నికలు మిగతా 2లో..

# ప్రమాదంలో కడెం ప్రాజెక్టు



మొదటిపేజీ తరువాయి..

అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి ఫోన్ చేశారు సీఎం కేసీఆర్. ఈ సందర్భంగా కడెం ప్రాజెక్టు లో వరద పరిస్థితిపై ఆరా తీసారు సీఎం కేసీఆర్. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని ఆదేశించిన సీఎం కేసీఆర్.. అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో, మంపు గ్రామాలు, సహాయక చర్యలను సీఎంకు వివరించిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి. వరద కొంత తగ్గుముఖం పట్టిందని తెలిపారు.
కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో వరద ఉధృతిపై సీఎం కేసీఆర్ ఆరా తీశారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి ఫోన్చేసి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. మంపు గ్రామాలు, సహాయక చర్యలను సీఎం కేసీఆర్కు మంత్రి ఇంద్రకరణ్రెడ్డి వివరించారు. వరద కొంత తగ్గుముఖం పట్టిందని తెలిపారు. కడెం ప్రాజెక్టుకు 4.97 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో అధికారులు 17 గేట్లు ఎత్తి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే ప్రాజెక్టులోకి భారీగా వస్తుండగా, ఔట్ ఎ÷-లో అదేస్థాయిలో లేకపోవడంతో అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టు దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన 20 గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే కడెం ఉధృతిపై మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఏజెన్సీలో వరద బీభత్సం సృష్టిస్తున్నది. వరద ఉధృతికి శంభు మత్తడి గూడ ప్రాజెక్టు కట్ట తెగిపోయింది. దీంతో వరద దిగువ ప్రాంతాల్లోకి చేరుతోంది. ఈ క్రమంలో దిగువన ఉన్న లక్కారం, గంగన్నపేటలకు వరద ముప్పు పొంచి ఉండటంతో అప్రమత్తమైన అధికారులు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక జిల్లాలోని ఇచ్చోడలో 32.90 సెంటీమీటర్లు, నేరడిగొండలో 29.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఎగువ నుంచి వస్తున్న భారీ వరద నీటితో కేతేపల్లిలోని మూసీ ప్రాజెక్టు నిండు కుండలా మారింది. ప్రాజెక్టు 6 గేట్లను ఎత్తి అధికారులు దిగువకు నీటిని విడుదల చేసారు. 645 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి గాను ప్రస్తుతం 638.30 అడుగులకు డ్యామ్ చేరుకున్నది. 3800 క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో గా వస్తుండగా..3200 క్యూసెక్కుల నీటిని గేట్స్ ద్వారా దిగువకు వదులు తున్నారు. ఇక మూసీ గేట్లు తెరుచుకున్నాయన్న సమాచారంతో పర్యాటకులు తరలి వచ్చి మూసి పరవళ్లను చూసి సెల్ఫీలు దిగుతూ ఎంజాయ్ చేస్తున్నారు.జిల్లాలో వరుసగా కురు స్తున్న వర్షాలకు పలు మండలాల్లో చెరువులు నిండి అలుగు పోస్తున్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడలో పలు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. పెసర, శెనగ, పత్తి చేలు నీట మునిగాయి. జిల్లాలో ఎడతెరిపి లేకుండా జల్లులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని పలు రహదారుల్లో అభివృద్ధి పనులు చేపడుతుండటంతో గుంతల్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. సూర్యాపేటలోని సద్దుల చెరువు అలుగు పోస్తోంది. మోతె మండలం లోని పెద్ద చెరువులు, కుంటలు, చెక్డ్యామ్లు, నామవరం పెద్ద చెరువు, కూడలి చెక్ డ్యామ్, రావిపహాడ్లోని పెద్ద చెరువు అలుగు పోస్తోంది. నర్సింహాపురం, తుమ్మగూడెం బ్రిడ్జిల వద్ద వరద పెరిగి వ్యవసాయ పొలాలు నీట మునిగాయి. సిరికొండ గుట్ట మీద నుంచి జాలు వరద వస్తోంది. గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో సగటు వర్షపాతం 15.5మి.మీ నమోదైంది. అత్యధికంగా నడిగూడెంలో 28.6మి.మీ నమోదుకాగా అత్యల్పంగా తుంగతుర్తిలో 5.2మి.మీ నమోదైంది. మూడేళ్ల క్రితం మొదలుపెట్టిన మూసీ ఆధునికీకరణ పనులు ఇప్పటివరకూ పూర్తి కానందున ఆయకట్టు చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట నియోజకవర్గంలో ఉన్న మూసీ ప్రాజెక్టు, పిల్లలమర్రి, ఉండ్రుకొండ దేవాలయాలను ఈకో టూరిజంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో కాళేశ్వరం ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. గత రెండు రోజులుగా ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుతోంది. ఫలితంగా ప్రాజెక్టులోని బ్యారేజీలకు మొదటిసారి రికార్డు స్థాయిలో భారీ వరద నమోదైంది. మేడిగడ్డలో మొత్తం 85 గేట్లు, సరస్వతీ బ్యారేజీలో 62 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. భారీ వర్షాలకు ఎక్కడికక్కడ వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వరదనీరు వచ్చి చేరుతుండటంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరద ధాటికి పుష్కరఘాట్లు మునిగిపోయాయి. అనంతరం రోడ్లపైకి.. ఆ తర్వాత దుకాణాల్లోకి వరదనీరు చేరింది. దీంతోకాళేశ్వరం ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. తెలంగాణ, మహారాష్ట్రల్లో కురుస్తోన్న భారీ వర్షాలతో ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలకు మొదటిసారి రికార్డు స్థాయిలో భారీ వరద నమోదైంది. మేడిగడ్డ బ్యారేజీలోకి ఉధృతంగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఈ బ్యారేజీలో మొత్తం 85 గేట్లను తెరిచి 12,10,600 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సరస్వతీ బ్యారేజీలో 65 గేట్లకు గానూ 62 గేట్లు ఎత్తారు. బ్యారేజీకి 7,78,000 క్యూసెక్కుల ఇన్ ఎ÷-లో.. అదే స్థాయిలో ఔట్ ఎ÷-లో జరుగుతోంది.మరోవైపు ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు వద్ద కూడా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. వదర ఎక్కువగా వస్తుండటంతో అక్కడ మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. హుస్సేన్ సాగర్ నీటి మట్టం గరిష్టస్థాయికి చేరుకుంది. నగరంలో కురుస్తున్న వర్షాలతో చెరువులు నిండిపోయాయి. చిన్న చిన్న చెరువుల నుంచి నీరు వచ్చి చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 513.45 అడుగులు ఉ ండగా..ప్రస్తుతం 513.41 అడుగులకు చేరుకుంది. దీంతో అధికారులు ఒక గేట్ ఎత్తి నీటిని కిందకు విడుదల చేశారు. చిన్న చిన్న నాలాల ద్వారా ఈ నీరు మూసి నీదిలోకి వచ్చి చేరుతోంది. ఒక్కసారిగా గేట్లు ఓపెన్ చేస్తే.. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న జీహెచ్ఎంసి, ఇరిగేషన్ అధికారులు హుస్సేన్ సాగర్ నీటి పరిస్థితిని సమీక్షించారు. సాగర్ లోకి 1500 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉందని, ఔట్ ఫ్లో కూడా 1500 క్యూసెక్కులుగా ఉందని అధికారులు తెలిపారు. మూడు ప్రధాన నాలాల నుండి సాగర్ లోకి నీరు వస్తోందని, నీళ్లను కిందికి వదిలినట్లు వెల్లడించారు. ఎలాంటి ఇబ్బంది పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. నీటి ప్రవాహం పెరిగితే మరో గేట్ ఓపెన్ చేస్తామని వెల్లడిస్తున్నారు. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో ఆగకుండా వానలు పడుతున్నాయి. మరో నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు ఉంటాయని వాతావరణశాఖ మరోసారి అలర్ట్ ఇచ్చింది. హైదరాబాద్ లోని ఆయా ప్రాంతాల్లో తెలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిశాయి. చందానగర్ లోని అర్బన్ హెల్త్ సెంటర్ దగ్గర 4 సెంటీ మీటర్ల మోస్తరు వర్షం నమోదవుగా...గాజులరామారంలో 3.5 సెంటీమీటర్ల మోస్తారు వర్షం కురిసింది. బాలానగర్, చందానగర్, మలక్ పేట్, జీడిమెట్లలో 3.5 సెంటీ మీటర్ల మోస్తరు వర్షం కురిసింది. ఖైరతాబాద్, కూకట్ పల్లి, చార్మినార్, అంబర్ పేట్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కుత్బుల్లాపూర్, గోషామహల్, నాంపల్లి, ఫలక్ నుమా, మూసాపేట్ లో 3 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదవ్వగా.. సిటీలోని మిగతా ఏరియాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. భద్రచాలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. మంగళవారం ఉదయం తగ్గిన ప్రవాహం మళ్లీ పెరిగుతూ వస్తున్నది. దీంతో నీటిమట్టం మళ్లీ 53 అడుగులకు చేరింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సాయంత్రానికి వరద ప్రవాహం మరితం పెరిగే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నారు. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను జిల్లా కలెక్టర్ అనిరుధ్ ఆదేశించారు. భారీ వరదతో భద్రాద్రి రామాలయం పడమరమెట్ల వద్ద నీరు చేరింది. ఆలయ దుకాణాలు నీటమునిగాయి. అన్నదాన సత్రంలోకి నీరు చేరడంతో ఆలయ అధికారులు నిత్య అన్నదానం నిలిపివేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు ఏరులై పారుతున్నాయి. వందలాది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రోడ్లు కొట్టుకుపోయాయి.. చెరువులు కట్టలు తెగుతున్నాయి.. ఏజెన్సీల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలో వర్షాలు దంచికొడుతున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వందలాది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.ములుగు ఏజెన్సీలో చాలా గ్రామాలు అంధకారంలో మగ్గుతున్నాయి. రామప్ప, లక్కవరం, భద్రకాళీ, వడ్డేపల్లి చెరువులు అలుగుపోశాయి. మరోవైపు గోదావరి నది ఉ గ్రరూపం దాలుస్తోంది. రామన్నగూడెం పుష్కరఘాట్, వాజేడు పేరూరు వద్ద గోదావరి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తుండడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. భద్రకాళీ చెరువు రెండు రోజులుగా అలుగు పారుతోంది. శివనగర్లోని నాలాలు పొంగిపొర్లడంతో రోడ్లపైకి, కాలనీల్లోకి నీరు చేరింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు ఎడతెరిపిలేకుండా కురుస్తూనే ఉన్నాయి. ఐదు రోజులుగా ముసురు పడుతూనే ఉంది. హనుమకొండ,జిల్లాలోని దాదాపు అన్ని చెరువులు పూర్తిగా నిండి జలకళను సంతరించుకున్నాయి. పెద్ద చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. వర్షాల వల్ల జనం బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలుచోట్ల ఇళ్లలోకి వరదనీరు ప్రవేశించింది. నగరంలోని తోతట్టు ప్రాంతాల పరిస్థితి మరింత క్షీణించింది. ఇలాగే మరో రెండు రోజులు వర్షం పడితే నగరంలోని అనేక ప్రాంతాలు మరోసారి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. పరిస్థితిని జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. వరంగల్ నగర పాలక సంస్థ అధికారులు నగరంలోని నీటమునిగిన ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలు ఏర్పడిన పక్షంలో ప్రజలను ముంపు ప్రాంతాల నుంచి తరలించడానికి డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. హైదరాబాద్ నుంచి పడవలను కూడా తెప్పించారు. వర్షాలతో కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, చిరువ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. ఉదయం నుంచి బలంగా ఈదురుగాలులు వీస్తున్నాయి. నగరంలోని నాలాలన్నీ పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు కాలనీల్లో వర్షంపునీరు మోకాలు ఎత్తువరకు నిలిచి ఉండడంతో కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బంది పడుతుండడం కనిపించింది. మురికివాడలన్నీ బురదమయంగా మారిపోయాయి. వర్షపునీరు నిలిచి పరిస్థితి దయనీయంగా మారింది. మార్కెట్లు చిత్తడిగా మారాయి. ఐదురోజులుగా చిరువ్యాపారులు వ్యాపారాలు లేక నష్టపోతున్నారు. భారీవర్షానికి పంటపొలాలన్నీ వరదనీటిలో మునిగిపోయాయి.
పత్తిమొలకలు అక్కరకు రాకుండా పోయాయి. ఐదురోజులుగా వర్షపునీరంతా పొలాల్లోనే నిలిచి ఉండడంతో పలు గ్రామాల్లో పత్తి మొలకలు, వరినాట్లు ఎర్రబారుతున్నాయి.ఇంకా రెండు రోజులు వర్షాలు ఇలాగే కురిస్తే అవి పూర్తిగా పాడైనట్టేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఐనవోలు మండలంలో ఆకేరు చెక్డ్యాం అలుగుపోస్తోంది. వెంకటాపురం లోని రెండు చెరువులూ మత్తళ్లు పోస్తున్నాయి. దామెర మండలంలో పసరగొండ, పులుకుర్తి చెరువులు పొంగుతున్నాయి. కమలాపూర్ మండలంలో కూడా వర్షం విస్తృతంగా కురిసింది. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే

# మళ్లీ గులాబీదే అధికారం

మొదటిపేజీ తరువాయి..

జరిగితే.. అధికారంలో మరోసారి టీఆర్ఎస్ సొంతమవుతుందని ఆరా సర్వే వెల్లడించింది. ముందస్తు ఎన్నికల గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆరా పోల్ స్ట్రాటజీస్ ప్రైవేట్ లిమిటెడ్ హెడ్ మస్తాన్ ప్రకటన చర్చనీయాంశంగా మారింది. తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే.. టీఆర్ఎస్కే ఆధిక్యం సాధిస్తుందని ఆయన తెలిపారు. టీఆర్ఎస్కు 38.88 శాతం ఓట్లు వస్తాయని ఆయన స్పష్టం చేశారు. అయితే గతంలో మాదిరిగా వార్ వన్సైడ్ ఉంటే అవకాశం లేదని ఆయన చెప్పిన గణాంకాలను బట్టి అర్థమవుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికలతో టీఆర్ఎస్కు 46.87శాతం ఓట్లు రాగా.. తాజా సర్వేలో 8 శాతం తగ్గుదల ఉందని తెలిపారు. ఇక ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీజేపీకి 30.48 శాతం ఓట్లు వస్తాయని ఆరా సర్వే అంచనా వేసింది. ఇక కాంగ్రెస్కు 23.71 శాతం వచ్చే ఛాన్స్ ఉందని వెల్లడించింది. ఇక తెలంగాణలోని ఇతరులకు 6.93 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉందని మస్తాన్ తెలిపారు. ఇటీవల తమ సంస్థ పేరుతో తప్పుడు ప్రచారం జరుగుతోందన్న ఆయన.. ఇప్పటికీ టీఆర్ఎస్ ఆధిక్యంలోనే ఉందని తెలిపారు.
ఇక కొంతకాలంగా తెలంగాణలో ముందస్తు ఎన్నికలకు సంబంధించిన రాజకీయ సవాళ్లు మొదలయ్యాయి. టీఆర్ఎస్కు దమ్ముంటే ప్రభుత్వాన్ని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ ఇదే రకమైన వాదనను వినిపిస్తున్నాయి. అదే సమయంలో టీఆర్ఎస్ కూడా ఇందుకు ధీటుగా స్పందిస్తోంది. కేంద్రంలో బీజేపీ కూడా ముందస్తు ఎన్నికలకు సిద్ధపడితే.. తాము కూడా ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళతామని టీఆర్ఎస్ ఛాలెంజ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే దానిపై అనేక రకాల ఊహాగానాలు మొదలయ్యాయి. తాజాగా ఆరా సర్వే మాత్రం తెలంగాణలో ఇప్పటికప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ టీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని.. అయితే విపక్ష బీజేపీ బాగా బలపడుతుందని అంచనా వేశాయి. మొత్తానికి తెలంగాణలో వర్షాలు ప్రజలను వణికిస్తుంటే.. రాజకీయాలు మాత్రం వేడి పుట్టిస్తున్నాయి.
మరోవైపు దేశంలోనే అతిపిన్న రాష్ట్రమైనా అభివృద్ధిలో తెలంగాణ ను అగ్రగామిగా నిలబెట్టామని అధికార టీఆర్ఎస్ చెప్పుకుంటోంటే, రాష్ట్రంలో పాగా వేసేందుకు ప్రయత్నిస్తోన్న జాతీయ పార్టీ బీజేపీ మాత్రం కల్వకుంట్ల కుటుంబం అక్రమాలంటూ ఆరోపణలు చేస్తున్నది. కేంద్రం వర్సెస్ తెలంగాణ, సీఎం కేసీఆర్ వర్సెస్ పీఎం మోదీ అన్నట్లుగా సాగుతోన్న రాజకీయ పోరుతో రాష్ట్ర రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. వచ్చే ఎన్నికల్లో ఏం జరుగుతుందోననే చర్చ కొనసాగుతోన్న క్రమంలో అసంతృప్తి ఉన్నప్పటికీ సీఎం కేసీఆర్ కు ప్రజాదరణ తగ్గలేదని కీలక సర్వేలో వెల్లడైంది.. ప్రఖ్యాత సెంటర్ ఫర్ నేషనల్ ఒపినియన్ సర్వే (సీఎన్ఓఎస్) సంస్థ.. ప్రజాదరణ కలిగిన పాలకులు ఎవరనే అంశంపై భారీ సర్వే నిర్వహించింది. ప్రధాని మోదీతోపాటు దేశంలోని 25 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రజాదరణ ఏ మేరకు ఉందనే అంశంపై ఇటీవల సీఎన్వోఎస్ బృందాలు ఆయా రాష్ట్రాల్లో సర్వే నిర్వహించగా.. తెలంగాణ సీఎం కేసీఆర్ మధ్యస్థంగా 11వ స్థానంలో నిలిచారు. అయితే ఆయన నాయకత్వానికి అప్రూవల్ రేటింగ్ మెరుగ్గా ఉండటం గమనార్హం. సీఎన్ఓఎస్ తాజాగా విడుదల చేసిన సర్వే ఫలితాల్లో ప్రజాదరణ కలిగిన సీఎంల జాబితాలో కేసీఆర్ 11వ స్థానంలో నిలవగా, ఆయన నాయకత్వంపై 49 శాతం మంది ప్రజలు సంతృప్తితో ఉన్నట్లు వెల్లడైంది. అయితే కేసీఆర్ పై 19 శాతం మంది అసంతృప్తితో ఉన్నారు. 24 శాతం మంది తటస్థంగా ఉన్నారు. పొరుగు తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ మాత్రం అనూహ్యంగా దిగువన 20వ స్థానంలో నిలవడం గమనార్హం. దేశంలో ప్రస్తుతం అత్యంత ప్రజాదరణ పొందిన సీఎంగా ఒడిసా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నిలిచారు. ఆ రాష్ట్రంలో 70 శాతం ప్రజలు ఆయన నాయకత్వంపై పూర్తి సంతృప్తితో ఉ ండగా.. 19 శాతం మందే అసంతృప్తి వ్యక్తం చేశారు. దేశంలో జనాదరణ పొందిన మొదటి ఐదుగురు ముఖ్యమంత్రుల్లో నవీన్ 51 పాయింట్ల నికర ఆమోదంతో ప్రథమ స్థానంలో నిలవగా.. తర్వాతి స్థానాల్లో వరుసగా యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్), ఉద్ధవ్ థాక్రే (మహారాష్ట్ర–ఇటీవలే రాజీనామా చేశారు), హిమంత బిశ్వ శర్మ (అసోం), భగవంత్సింగ్ మాన్ (పంజాబ్) నిలిచారు. ఏపీ సీఎం జగన్ తర్వాత అట్టడుగున నిలిచిన సీఎంలలో మనోహర్లాల్ ఖట్టర్ (హరియాణా), బసవరాజ్ బొమ్మయ్ (కర్ణాటక), నీఫూ రియో (నాగాలాండ్), ప్రమోద్ సావంత్ (గోవా), మాణిక్ సాహా (త్రిపుర) ఉన్నారు. సీఎన్వోఎస్ తాజా సర్వే ప్రకారం ప్రధాని మోదీకి ప్రజాదరణ స్వల్పంగా పెరిగింది. గతంతో పోలిస్తే నికర ఆమోదం రేటింగ్ 36 పాయింట్లకు చేరుకుంది. దేశంలో 54 శాతం మంది ఆయన నాయకత్వాన్ని ఆమోదించారు. 18 శాతం మంది అసంతృప్తితో ఉన్నారు.

## వరదలను పట్టించుకోని సీఎం కేసీఆర్

### విమర్శలు కాదు.. సమస్యలపై చర్చించాలి
### మండిపడ్డ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



నిజామాబాద్,జూలై13: సీఎం కేసీఆర్ అసమర్థుడు..అవినీతి పరుడు అని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. రాష్ట్రంలో వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వాటిపై సమీక్షలు పెట్టాల్సింది పోయి..విపక్షాలను తిట్టేందుకు ప్రెస్ మీట్లు పెడతారా అని ప్రశ్నించారు. గ్రామాల్లో వర్షాలతో ప్రాజెక్టులు, చెరువుల కట్టలు తెగిపోతున్నాయన్నారు. ఇరిగేషన్ డిపార్ట్ మెంట్కు అధికారులకు సమన్వయం లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. సొల్లు కబుర్లు..మొరుగుడు బంద్ చేసి సమస్యలపై రివ్యూ చేయాలని సూచించారు. ఒక్క నిజామాబాద్ నియోజకవర్గంలోనే 230 ఇండ్లు దెబ్బతిన్నాయని కొన్ని ఇండ్లు కూలిపోయాయన్నారు. వరదల వల్ల 9 మంది చనిపోయినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని..రూ. 300 కోట్లకు పైగా ఆస్తినష్టం సంభవించిందని ప్రభుత్వం పేర్కొన్నట్లు వెల్లడించారు. ఏపీ విభజన చట్టం ప్రకారం 9 జిల్లాలను వెనుకబడిన జిల్లాలకు ప్రకటించి రోడ్ల అభివృద్ధికి 2015 నుంచి ప్రతీ ఏడాది 50 కోట్లు కేంద్రం ఇస్తుందని ఎంపీ అరవింద్ తెలిపారు. కానీ రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు కలరించి ఇచ్చి శంకుస్థాపనలు చేశారన్నారు. నీతి ఆయోగ్ ఇచ్చిన నిధుల వినియోగంపై వెరిఫికేషన్ కు వస్తామని అధికారులు ప్రకటించడంతో ఆగమేఘాల మీద శిలాఫలకాలు తొలగించి కేంద్రం ఇచ్చినట్లు బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. కేసీఆర్ పచ్చి అబద్దాల కోరు అని ఎంపీ అరవింద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్మినిస్ట్రేషన్ తెలియని అవివేకి కేసీఆర్ అని మండిపడ్డారు. ప్రెస్?మీట్ పెట్టి అన్ని అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. మిగులు బ్జడెట్ లో ఉన్న రాష్టాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో డ్రగ్ కల్చర్, మత్తు పదార్థాల సరఫరాలో తెలంగాణ దూసుకుపోతుందన్నారు. కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తున్నా... నిధులు మంజూరు చేస్తున్నా..కేంద్రంపై నిందలు వేస్తూ...తెలంగాణ ప్రజలను మభ్యపెడుతున్నారని ఎంపీ అరవింద్ మండిపడ్డారు.



## తెలంగాణ పాలిసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్,జూలై13:తెలంగాణ పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ ఫలితాలను విడుదల చేశారు. పాలిసెట్ ఎంపీసీ విభాగంలో 75.73 శాతం ఉత్తీర్ణత సాధించగా.. పాలిసెట్ ఎంబైపీసీ విభాగంలో 75.81 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు నవీన్ మిట్టల్ తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశాలకు వెంటనే నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు వెల్లడించారు.జూన్ 30న 365 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించగా.. 14,432 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులతో పాటు అగ్రికల్చర్, వెటర్నరీ, హార్టికల్చర్, బాసర ట్రిపుల్ ఐటి ప్రవేశాలను పాలిసెట్ ర్యాంకు ఆధారంగా భర్తీ చేయనున్నారు.

## కొత్త రైల్వే లైన్కు మోక్షం

మొదటిపేజీ తరువాయి..

నిర్మాణానికి ఆమోదం తెలిపినట్టు కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ వెల్లడించారు. కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టును 2026–27 నాటికి పూర్తి చేయనుందన్నారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైన్ ద్వారా రాజస్థాన్లోని శిరోహి జిల్లా, గుజరాత్లోని సబర్కాంత, బనస్కాంత, మెహెసానా జిల్లాల మీదుగా వెళ్లనున్నట్టు తెలిపారు. ఈ పొడవైన రైలు మార్గం ప్రజారవాణాను పెంచడంతో పాటు వ్యవసాయ, స్థానిక ఉ త్పత్తులను వేగంగా రవాణా చేసేందుకు ఇది ఉపయోగపడనుంది. అలాగే, పెట్టుబడులను ఆకర్షించడం, సామాజిక అభివృద్ధిని మెరుగుపరచడంతో పాటు నిర్మాణం సమయంలో లక్షలమందికి ఉ పాధి అవకాశాలు కల్పిస్తుందని కేంద్రం తెలిపింది. ఈ లైన్ను అంబాజీ శక్తిపీఠ్ నుంచి అజిత్ నాథ్ జైన దేవాలయానికి అనుసంధానం చేయనున్నారు. గుజరాత్, రాజస్థాన్తో పాటు దేశంలోని ఇతర ప్రదేశాలకు వస్తువుల రవాణాకు ఈ లైన్ దోహదపడనుంది. ప్రస్తుతం ఉన్న అహ్మదాబాద్–అబు రోడ్డు రైల్వే లైన్కు ఇది ప్రత్యామ్నాయంగా ఉండనుంది. అంబాజీ శక్తిపీఠానికి ఏటా గుజరాత్తో పాటు దేశ విదేశాల నుంచి లక్షలాది భక్తులను తరలివస్తుంటారు. అలాగే, మౌంట్ అబూలో బ్రహ్మ కుమారిల ప్రధాన కార్యాలయం ఉండటంతో అక్కడకు కూడా ప్రపంచ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. దీంతో ఈ కొత్త రైల్వే మార్గం లక్షల మంది భక్తుల రవాణాను సులభతరం చేయనుంది. అలాగే, గుజరాత్లోని హెహ్సానా పాడి పరిశ్రమతో పాటు గుజరాత్ మార్బుల్ పరిశ్రమకు ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది.



## రాష్ట్రపతి ఎన్నికలకు బ్యాలెట్ల తరలింపు

### అన్ని రాష్ట్రాలకు విమానాలో చేరవేత

న్యూఢిల్లీ,జూలై13: రాష్ట్రపతి ఎన్నికలకు సమయం దగ్గర పడడంతో కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఈ నెల 18న రాష్ట్రపతి ఎన్నిక జరుగనుంది. దీంతో 'నిర్వచన్ సదన్' నుంచి రాష్ట్రపతి ఎన్నికల బ్యాలెట్ మెటీరియల్ తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. పుదుచ్చేరి, తెలంగాణ సహా 14 రాష్ట్రాలకు అధికారులు తరలించారు. ఆయా రాష్ట్రాలనుంచి వచ్చిన అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు బ్యాలెట్ మెటీరియల్ తీసుకువెళ్లారు. రాష్ట్రపతి ఎన్నికల్లో అసెంబ్లీ కార్యదర్శులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. రాష్ట్రపతి ఎన్నికల కోసం తరలించే బ్యాలెట్ మెటీరియల్ను విమాన మార్గం ద్వారానే తరలిస్తారు. ఆయా రాష్ట్రాల రాజధానులకు వెళ్లే విమానాల్లో 'మిస్టర్ బ్యాలెట్ బాక్స్' పేరుతో టికెట్ కొనుగోలు చేసి పంపిస్తారు. హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ మినహా అన్ని రాష్ట్రాలకు వాయుమార్గంలోనే బ్యాలెట్ మెటీరియల్ను తరలిస్తారు. ఈనెల 15వ తేదీ వరకు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ భవనాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్లకు చేరవేస్తారు. ఇప్పటికే పలు రాష్ట్రాలకు అందగా మిగిలిన రాష్ట్రాలకు బుధవారం తరలించనున్నామని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ దగ్గరుండి పర్యవేక్షించారు. కాగా ఈనెల 18న రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ జరగనుంది. అనంతరం ఈనెల 21న పార్లమెంట్ హౌస్లో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. పార్లమెంట్ సమావేశాలను కూడా అదేరోజునుంచి ప్రారంభం కానున్నాయి. ఎంపిలు పార్లమెంటులో, ఎమ్మెల్యేలు అసెంబ్లీల్లో ఓటు వేస్తారు.



## వ్యాధులు ప్రబలకుండా 8 వ డివిజన్ లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన జీడబ్లూఎంసి

**హన్మకొండ జూలై 13 (ప్రజామంటలు):** జిడబ్లూఎంసి కమిషనర్ ఆదేశానుసారం 8వ డివిజన్ లో మునిసిపల్ పారిశుధ్య కార్మికులు వర్షాన్ని లెక్క చేయకుండా



బుధవారం ఉదయం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వర్షాల వల్ల కొట్టుకొచ్చి పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించారు. నిల్వ ఉన్న వర్షపు నీటిని కాల్వల్లోకి మళ్లించారు. 8వ డివిజన్ కార్పొరేటర్ భైరి లక్ష్మికుమారి, శ్రావణ్ కుమార్ లు దగ్గర ఉండి పనులు పర్యవేక్షించారు. జవాను జన్ను రాము, ఇతర మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుట్కా స్థావరంపై టాస్క్ ఫోర్స్ దాడి

**భారీగా సరకు స్వాధీనం**

**హన్మకొండ జులై 13 (ప్రజామంటలు):** జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సిహెచ్ శ్రీనివాస్




కి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, ధర్మసాగర్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముప్పారం గ్రామ వాసి కందిమల్ల వేణుగోపాల్ ఇంటిపై టాస్క్ ఫోర్స్ దాడి చేసి, రూ.2 లక్షల 2 వేల 250 రూ.ల విలువ చేసే సరుకును స్వాధీనం చేసుకున్నారు. వేణుగోపాల్ కు, రవికంటి శేఖర్ నిషేధిత పొగాకు ఉత్పత్తులు సరఫరా చేస్తున్నట్టు టాస్క్ ఫోర్స్ పోలీసుల విచారణలో తేలింది. 209 ప్యాకెట్ల అంబర్, 91 ప్యాకెట్ల ఆర్ఆర్, 190 ప్యాకెట్ల జేకే, 31 ప్యాకెట్ల స్వాగత్, 85 ప్యాకెట్ల బ్లాక్ బాబా నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. కందిమల్ల వేణుగోపాల్, ఇంజల దేవేందర్ ల ను అరెస్ట్ చేశారు. రవికంటి చంద్రశేఖర్, యాకయ్యలు పరారీలో ఉన్నారు. తదుపరి చర్యల కోసమై నిందితులను ధర్మసాగర్ పోలీసులకు అప్పగించారు.

## కరెంటు వచ్చి పోవడం వలన కాలిపోయిన మీటర్లు

**తరిగొప్పుల/ చిల్పూర్ జులై 12 (ప్రజామంటలు):** మండలంలోని కృష్ణాజిగూడెం



గ్రామంలో ఈ ఉదయం తెల్లవారుజామున కరెంటు వచ్చి పోవడం వలన మీటర్లు కాలిపోయాయి. ఈ సంఘటన 3, 4, 5 వార్డ్ లలో ఊరడి లింగయ్య ఇంటివద్ద పూర్తిగా ఖాళీ పోయింది. సిపిఎం మండల కార్యదర్శి సాదం రమేష్, వైఎస్ఆర్ టిపి జనగాం జిల్లా యూత్ ప్రెసిడెంట్ మాజీ ఉపసర్పంచ్, ఊరడి శ్రీనివాస్ లు సందర్శించి పరిశీలించారు. దాదాపు 50 ఇండ్లలో 3, 4, 5 వార్డ్ లలో మీటర్ లు, బల్బులు, టీవీలు పూర్తిగా ఖాళీపోవడం జరిగింది. కరెంట్ తో కాలిపోయిన మీటర్లు ప్రభుత్వం మే వాట్టికి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

## సంక్షేమ హాస్టల్, గురుకులాల్లో మొబైల్ టీమ్స్ ల ద్వారా మెరుగైన వైద్యం అందించాలి

**హుజూరాబాద్ జూలై 13 (ప్రజామంటలు):** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్నందువలన సంక్షేమ హాస్టల్స్ , గురుకుల పాఠశాల ,కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు విష జ్వరాలు సీజనల్ వ్యాధులు



సోకకుండా చర్యలు తీసుకోవాలని మొబైల్ టీమ్స్ ల ద్వారా మెరుగైన వైద్యం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రామారపు వెంకటేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని అధికార యంత్రాంగాన్ని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఎదుర్కొనే సీజన్ వ్యాధులు పట్ల ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.పాఠశాల, కళాశాల ,హాస్టళ్లలో మురుగునీరు ఎక్కువ శాతం నిల్వ ఉండడం వలన దోమలు కుట్టడం వలన వచ్చే సీజనల్ వ్యాధులు విష జ్వరాలు,చికెన్ గునియా మలేరియా లాంటి అంటువ్యాధులను అరికట్టడంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. విద్యార్థులకు వసతులు లేమితో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంక్షేమ హాస్టల్ లో మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి మొబైల్ టీం ద్వారా సంక్షేమ హాస్టల్స్, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు త్వరగా అందించి మెరుగైన వైద్య సౌకర్యాలని కల్పించాలని వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



హుజూరాబాద్ మండలం కాట్రపల్లి లో మంగళ వారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిన ఎదులాపురం కమలమ్మ అనే మహిళ ఇల్లు.

## ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి

**జనగామ జూలై 13 (ప్రజామంటలు):** జనగామ స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో పట్నం, ఎస్ ఎఫ్ ఐ,డి.వై.ఎఫ్.వై. ఎఐడిడబ్లుఎ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్నం జిల్లా కన్వీనర్ బూడిద గోపి, ఎస్ ఎఫ్ ఐ, జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం, డి.వై.ఎఫ్.వై. జిల్లా కార్యదర్శి దుసరి నాగరాజు హాజరై మాట్లాడుతూ.... ప్రవేటు కార్పొరేట్ పాఠశాలలో ఫీజులు నియంత్రించాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్న ఇప్పటివరకు జిల్లాలో 40% పాఠ్యపుస్తకాలు కూడా ఇవ్వలేదన్నారు. జిల్లాలో 5 లక్షల 65 వేల పుస్తకాలు అవసరముండగా, కేవలం 3 లక్షల పుస్తకాలు మాత్రమే విద్యార్థులకు అందించారన్నారు. యూనిఫాం ఏ ఒక్క పాఠశాలలో ఇవ్వలేదనీ ఎప్పటికి ఇస్తారో తెలియదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేవని, భవనాలు శిథిలావస్థకు చేరి వానకు కురుస్తున్నా కనీసం మరమత్తులు చేపట్టడం లేదన్నారు. జిల్లాలో ఒక్కో ఎంఈవో నాలుగైదు మండలాలకు ఇన్ చార్జీలుగా ఉన్నారన్నారు. ఆ పోస్టులను భర్తీ చేయవలసిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా డిఇఓ, డిప్యూటీ డిఇఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. పాఠశాలలకు గ్రాంట్స్ కేటాయించాలని,స్కావెంజర్ పోస్టులు భర్తీ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ చార్జీలు పెంచాలనీ, నాణ్యమైన పౌష్టిక విలువలు కల్గిన భోజనం అందించాలన్నారు. విద్యా రంగానికి అత్యంత ప్రమాదకరమైన నూతన విద్యా విధానం రాష్ట్రంలో అమలు చేయవద్దన్నారు. ఫీజుల దోపిడీ చేస్తున్న ప్రైవేటు, కార్పోరేట్



యాజమాన్యాలను కట్టడి చేయడంలో, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విష్ణు, అజారుద్దీన్, జోగు ప్రకాష్, పల్లేర్ల లలిత, మరాడి వినోద్ కుమార్, కనకరాజు పాల్గొన్నారు.

## కంటి ఆపరేషన్ కై హైద్రాబాద్ కు తరలింపు

**జనగామ జూలై 13 (ప్రజామంటలు):** లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ ఆధ్వర్యంలో గత వారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారిని హైద్రాబాద్ తరలించారు. ఇందులో 19 మందికి ఆపరేషన్స్ నిర్ణయించి, గత వారం ఆపరేషన్స్ చేసుకున్న 14 మందిని ఉచితంగా బస్ లలో హైదరాబాద్ లోని ఎం.ఎస్.రెడ్డి లయన్స్ కంటి హాస్పిటల్ కి ఉచిత కంటి ఆపరేషన్స్ కోసం పంపించారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. కంటి జబ్బులకు సంబంధించిన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో అధ్యక్షులు కుతటి ఉప్పలయ్య, రీజియన్ చైర్మన్ గంగిశెట్టి ప్రమోద్ కుమార్, పి.ఆర్.సి ఎడమ సంజీవ రెడ్డి, డిస్ట్రిక్ట్ లైజన్ ఆఫీసర్ కృష్ణ జీవన్ బజాజ్, కార్యదర్శి చిదురాల బాబు, కోశాధికారి సముద్రాల సందీప్, డిసిలు రీజియన్ కార్యదర్శి మోహన్ రెడ్డి, డిసి తొడుపునూరి వెంకటనారాయణ, అనిత, నరేందర్ పాల్గొన్నారు.



## ఎండయినా వానైనా ప్రజాసేవ కోసం తగ్గేదేలే

● ఎమ్మెల్యే రసమయి తొలిపొద్దు కార్యక్రమం

**మానకొండూర్ జులై 13 (ప్రజామంటలు):** ఎండ, వాన, చలి అనే తేడా లేకుండా ప్రజాసేవే తన గమ్యంగా రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మెన్ మరియు మానకొండూర్ శాసనసభ్యులు డా. రసమయి బాలకిషన్ చేపట్టిన తొలిపొద్దు కార్యక్రమం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ప్రజల హృదయాల్లోకి దూసుకెళ్తుంది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉదయించిన రసమయి తొలిపొద్దు కార్యక్రమం రోజురోజుకు అత్యంత ప్రజాదరణ పొందుతుంది. మానకొండూర్ మండలంలోని ఖాదర్ గూడెం గ్రామంలో ఈరోజు వేకువ జామున ప్రారంభమైన పర్యటన గంగిపల్లి, కొండపల్కల గ్రామాలలో ఉదయం 10:00 గంటల వరకు వర్షంలో సైతం విస్తృతంగా కొనసాగింది. ఎమ్మెల్యే చేతిలో గొడుగు పట్టుకొని వరద నీటిలో సైతం ఆయా గ్రామాలలో కాలి నడకన కలియ తిరుగుతూ ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ పరిష్కరించారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇండ్లను, నెల కూలిన విద్యుత్ స్థంబాలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి కళ్యాణాలక్ష్మి మరియు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సంధర్భంగా మహిళలు మంగళ హారతులతో ఘనస్వాగతం పలుకుతూ నుదుట తిలకం దిద్దుతూ చక్కెర కుడుకలు పోసి ఎమ్మెల్యే రసమయి పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.





## వయో వృద్ధులను సురక్షిత భవనం లోకి తరలింపు

**జనగామ జూలై 13 (ప్రజామంటలు):** భారీ వర్షాలు నేపథ్యంలో వృద్ధాశ్రమం భవనం కురుస్తున్నందున వృద్ధులను సురక్షిత భవనంలోకి తరలించినట్లు జిల్లా కలెక్టర్ సిహెచ్ శివలింగయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ లో మహిళా శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ వృద్ధుల కోసం నడపబడుతున్న రాజరాజేశ్వరి ఓల్డ్ ఏజ్ హెూమ్ ను జిల్లా సంక్షేమ అధికారిని జయంతి మరియు ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ చింతకింది రాజు సందర్శించి పరిశీలించారు మూడు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో వారి యొక్క యోగక్షేమాలు తెలుసుకోవడానికి వెళ్లగా భారీ వర్షాలకు బిల్డింగ్ లొ లీకేజీ నుంచి వర్షం పడుతూ ఉండడం గమనించి కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే వారి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కోసము కొత్త భవనాన్ని చూడాలని ఆర్డీఓ ను ఆదేశించారు. ఆర్డీవో మున్సిపల్ కమిషనర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ సహకారంతో రాజరాజేశ్వరి హెూం లో ఉన్న వస్తువులన్నింటినీ ట్రాక్టర్ ద్వారా తరలిస్తూ వృద్ధులందరినీ ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అంబులెన్స్ లో బెడ్ రీడన్ గా ఉన్న వృద్ధులతో పాటు అందరిని సఖి వాహనం ద్వారా సురక్షితంగా కొత్త భవనంలోకి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మధు మోహన్, జిల్లా సంక్షేమ అధికారిని జయంతి, మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఎమ్మార్వో రవీందర్, జనగామ సిడిపిఓ రమాదేవి, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ యాదవ్ ,ఫీల్డ్ రెస్పాన్స్




ఆఫీసర్ చింతకింది రాజు, సఖి సిఏ రేణుక, రాజరాజేశ్వరి ఓల్డ్ ఏజ్ హెూమ్ నిర్వాహకురాలు భశపాక రాజేశ్వరి, సఖి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి ప్రవాహం పెరుగుతుంది జాగ్రత్త

● జిల్లా కలెక్టర్ జి. రవి



**ధర్మపురి జూలై 13 (ప్రజామంటలు):** ఎస్సారెస్పీ ప్రాజెక్ట్, కడెం ప్రాజెక్టు నుంచి భారీ ఎత్తున వరద విడుదల చేస్తున్న నేపథ్యంలో జగిత్యాల జిల్లాలో దాదాపు 7 లక్షల క్యూసెక్కుల గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుందని, స్థానికంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మరో లక్ష క్యూసెక్కుల వరద పెరిగే అవకాశం సైతం ఉందని కలెక్టర్ తెలిపారు. జగిత్యాల జిల్లాలో గోదావరి నది పర్యాహక 10 గ్రామాల నుంచి 2300 మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు పునరావస కేంద్రాలకు తరలించామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న 1100 చెరువులలో 750 చెరువులో నిండి ఓవర్ ఫ్లో అవుతున్నాయని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. ఎస్పి సింధు శర్మ మాట్లాడుతూ.... 37 రోడ్లపై నీటి ప్రవాహం ఉన్న నేపథ్యంలో వాటి రవాణా మూసి వేసామని, ప్రజలు అనవసరంగా బయటకు రావద్దని, ఉన్నప్పటికీ రిస్క్ చేసి రోడ్లపై ప్రయాణించవద్దని తెలిపారు

## గోదావరి వరదలు తగ్గాలని ప్రత్యేక పూజలు

**ధర్మపురి జూలై 13 (ప్రజామంటలు):** గత మూడు రోజుల నుండి



గోదావరి నది ఉధృతరూపం దాల్చటంతో గోదావరి మాతను శాంతింప చేయటానికి ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం ధర్మపురి దేవస్థానం ఆధ్వర్యంలో సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా గోదావరి మాతకు ప్రత్యేక పూజలు, వాయనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, ఇందారపు రామన్న, సంగి సత్తెమ్మ, దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అధికారులు, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎన్ టి.వి. రిపోర్టర్ జమీర్ గల్లంతు

**సహాయక చర్యలను పర్యవేక్షించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

**రాయికల్ జులై 13 (ప్రజామంటలు):** రాయికల్ మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన 9 మంది కూలీలు కాపాడే నిమిత్తం



న్యూస్ కవరేజీకి వెళ్ళిన జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎన్ టి.వి. రిపోర్టర్ జమీర్ రామోజీపేట్ భూపతి పూర్ రోడ్డులో కారుతో సహా వరద ప్రమాదం లో గల్లంతు కాగా సంఘటన స్థలంలో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురం క్రీస్తుజ్యోతి మినిస్ట్రీ డైరెక్టర్ డాక్టర్ జయప్రకాశ్ గోపు కు బుధవారం జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మినిస్ట్రీ ఫౌండర్ డాక్టర్ సంగాల పాల్సన్ రాజు, పాల్గొన్న వైఎస్ఆర్ టిపి స్టేషన్ ఘనపూర్ కో అర్డినేటర్ సంగాల యార్మియా.

## ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలి

**జనగామ జూలై 13 (ప్రజామంటలు):** వర్షాలు కురుస్తున్నందున ఇండ్లల్లో మొక్కలు నాటుకోవాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



కోరారు. బుధవారం ఉదయం మున్సిపాలిటీ లోని 7వ వార్డు లో మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరూ మొక్కను నాటే విధానాన్ని సంప్రదాయంగా మార్చుకోవాలన్నారు. పుట్టినరోజు, పెళ్లి రోజు పండుగలు వంటి రోజులలో ఒక్క మొక్కైనా నాటాలని వాటిని జాగ్రత్తగా పెంచి పర్యావరణానికి పాటుపడాలన్నారు. జిల్లాలో అడవుల శాతం తక్కువగా ఉన్నందున పచ్చదనం ఎంతో అవసరమన్నారు. అడవుల వలన ఋతువులు కూడా సక్రమంగా ఉంటాయని, తద్వారా ఆరోగ్యం కూడా సమతుల్యంగా ఉంటుందన్నారు. ఈ మొక్కల పంపిణీ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రుద్రంగి లో చెరువులను పరిశీలించిన ఇరిగేషన్ ఐబీడీఈ - ప్రశాంత్

**రుద్రంగి జూలై 13 (ప్రజామంటలు):** గత ఆరు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రుద్రంగి మండల కేంద్రము లోని చెరువులకు భారీగా నీరు వచ్చి చేరడంతో చెరువు కట్టలతో పాటు మత్తడిలను ఇరిగేషన్ ఐబీడీ ఈ. ప్రశాంత్ కుమార్, ఏఇ. శ్రీనివాస్, వర్క్ ఇనిస్పెక్టర్ రాజు, టిఆర్ఎస్ నాయకులు గంగం మహేష్, ముందస్తుగా ప్రమాదం జరగకుండా అచ్చయ్య కుంట చెరువు కట్టను పరిశీలించారు. మత్తడి వద్ద ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగింది అని



వారు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో రైతులు చంద్రయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణంపై శ్రద్ధ లేని జనం !

వర్షాలతో అంటువ్యాధులు ముసురుకుంటున్నాయి. గ్రామాల్లో పారిశుద్యం నేటికీ మిథ్యగానే మారింది. ప్రజల్లో బాధ్యత లేకుండా పోవడంతో పచ్చదనంతో పాటు, పారిశుద్ధ్యం కూడా పడకేస్తోంది. ఇది తమ పనికాదన్న ధోరణిలో ప్రజలు ఉంటున్నారు. ఇంటినుంచి చెత్త బయటకు వేయడం అలవాటు చేసుకున్నా.. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, తమ వీధుల్లో,ఇంట్లో మొక్కలు నాటాలని భావించడం లేదు. ప్రభుత్వాలు కూడా అన్నీ తామే చేస్తామన్న రీతిలో వ్యవహరించడంతో ప్రజల్లో పారిశుద్ధ్యం పట్ల బాధ్యత లేకుండా పోయింది. కనీసం రెండు మొక్కలను నాటుదామన్న భావన రావడం లేదు. గత ఐదారు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడెక్కడి చెత్తో వాగులు, వంకల ద్వారా చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా కొట్టుకుని వస్తోంది. ఎక్కడికక్కడ నీళ్లు నిలిచిపోవడంతో ప్రజలకు మంచినీరు కూడా కరువ య్యింది. స్వచ్ఛ భారత్ అమలు చేస్తున్నా గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం అమలు కాకపోవడం తో తీవ్ర కాలుష్యం ఏర్పడుతోంది. ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలను జార విడుస్తున్నారు. గ్రామాల్లో అవగాహన కొరవడడంతో కాలువల్లో గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. దీనికితోడు మురికినీరుచేరి కాలుష్యం వెదజల్లుతోంది. దీంతో భూమిలో అది చేరి వాతావరణ కాలుష్యాన్నిపెంచుతోంది. కేన్సర్ వ్యాధి వ్యాప్తికి, వాతావరణం కాలుష్యానికి కారణమౌతున్న ప్లాస్టిక్‌పై ప్రభుత్వం నిషేధం విధించినా అమలు కావడం లేదు. భూసారాన్ని దెబ్బతీస్తున్న పాలిథిన్ వినియోగాన్ని తగ్గించాలని కోరుతున్నా అధికారులు క్షేత్రస్థాయిలో వాటి వినియోగాన్ని నియంత్రించలేక పోతున్నారని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. ఇందుకు ఉద్యమ తరహా మార్పు అవసరమని పర్యావరణ వేత్తలు అభిప్రాయపడుతున్నారు. హరిత ఉద్యమం లాగే ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమంగా సాగితే తప్ప నిషేధం అమలు జరగదని అంటున్నారు. గ్రామాల పరిధిలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరిగిపోతోంది. ప్రతిపనికీ గ్లాసులు, విస్తార్లు, ప్లాస్టిక్ కవర్లు వినియోగించడంతో ప్లాస్టిక్ వినియోగం గ్రామాల్లో కూడా విపరీతంగా పెరిగింది. దీనికితోడు చెత్త శుద్ధి లోపించడంతో ప్రధాన రహదారుల్లో దుర్వాసన వెదజల్లుతోంది. పెళ్లిళ్లు,పండుగలు, పార్టీల్లో విచ్చల విడిగా ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లను వినియోగిస్తున్నారు. వినియోగం అనంతరం రహదారులు, కాలువుల,ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా పడేసి చేతులు దులుపుకుంటున్నారు. వాతావరణాన్ని కలుషితం చేసి మన ప్రాణాలను మనమే హరించేసుకుంటున్నామన్న విషయం గుర్తించేకపోతున్నారు. గుట్టలు గుట్టలుగా పడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారంగా భావించి తింటున్న పశువులు, జంతువులు మృత్యువాత పడుతున్నాయి. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, సీసాలను తరచూ వినియోగిస్తూ కేన్సర్ వ్యాధి సోకే లక్షణాలు అధికంగా ఉన్నా యని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న పిల్లలకు కూడా సోకే అవకాశం అధిక శాతం ఉందని సూచిస్తు న్నారు. వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో కాలువలు, డ్రెయిన్లు, ఖాళీ ప్రదేశాలు, డంపింగ్ యార్డుల్లో గుట్టలు గుట్టలుగా ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. డిస్పోజబుల్ వస్తువుల అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. దీంతో పలువురు వ్యాపారస్తులు టన్నుల కొద్ది నిల్వ చేసి అమ్మకాలు సాగిస్తు న్నారు. పలువురు వ్యాపారులు షాపుల ముందు, ఆరుబయట గుట్టలుగా పేర్చి విక్రయాలు నిర్వహిస్తు న్నారు. వైన్ షాపుల ముందు నీటి ప్యాకెట్లు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. ఆఖరకు కాఫీ హోటళ్లలో కూడా ప్లేట్లలో అరటి, ఇతర ఆకులకు బదులుగా ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్నారు. ఆహార పదార్థాలు ప్యాకింగ్‌కు సైతం వీటిని వాడుతున్నారు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్న



ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై జిల్లా కలెక్టర్ తహశీల్దార్లకు పూర్తి అధికారాలు ఇచ్చారు. అమ్మినా, కొనుగోలు చేసినా, వినియోగించినా, ఎక్కడబడితే అక్కడ వేసినా రూ.ఐదు వేల నుంచి రూ.25 వేల వరకూ జరిమానా విధిస్తారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై నిషేధం విధించినా ఎక్కడా అమలు కావడం లేదు. విక్రయ షాపులపై దాడులు చేసి వస్తువులను స్వాధీనం చేసుకోవడం, షాపులను సీజ్ చేయడం వారిపై కేసులు నమోదు చేసే అధికారం తహశీల్దార్లకు ఉంది. ముడుపులకు లొంగి చూసీ చూడనట్లు వ్యవహరించడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌లో పేపర్ గ్లాసులు, పేపర్ కవర్లు, ప్లేట్లు దర్శనమిస్తున్నా వివాహాది శుభకార్యాల్లో కూడా ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉంటుంది. దీనిపై మరలా అధికారులు విస్తృత ప్రచారం చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్లాస్టిక్ నిషేధ ఆజ్ఞలు అమల్లో ఉన్నా అమలు కావడం లేదు.

అధికారుల ఉదాశీనత, వినియోగదారుల అవగాహనలేమితో విచ్చలవిడిగా వినియోగం కొనసాగుతూనే ఉంది. దీంతో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఎక్కడ చూసినా కాలువలు, డ్రెయిన్లు వీటితో నిండిపోతున్నాయి. తాజాగా వర్షాలత కారణంగా కాలువల్లో గుట్టులగా పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శన మిస్తున్నాయి. కాలువలను శుభ్రంగా ఉంచుకోకపోవడంతో చెత్తాచెదారం నిండి నీటి నిల్వలతో దోమలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఇప్పటికే మలేరియా, డెంగ్యూ వ్యాప్తిలో ఉందని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామాలను పరిశభ్రంగా ఉంచుకోవాల్సి బాధ్యత ప్రజలదే. భారీ వర్షాలకు గ్రామాల్లో నీటినిల్వలు పెరిగాయి. దీంతో ఎక్కడికక్కడ నీరు నిలిచింది. ఇది కూడా వ్యాధుల సంక్రమణకు కారణం కానుంది. గ్రామాలను సమిష్టిగా పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రజలదే. అధికారులు వస్తారని, ఎవరో వచ్చి శుభ్రం చేస్తారని మిన్నకుంటే వ్యాధులతో బాధపడేది మనమేనని గుర్తించాలి. గ్రామాలను స్వచ్ఛంగా చేస్తున్నామని ప్రకటించి, నిధులు వృథా చేసే బదులు వార్డు మెంబర్లను బాధ్యులను చేయాలి. ఏ వార్డులో చెత్తా చెదారం, ప్లాస్టిక్ కనిపించినా వారిని బాధ్యులను చేస్తే బాధ్యత పెరగగలదు.




## సాహితీ ప్రేమికులైన పాఠకులకు ప్రత్యేకం

" ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్.

# చిట్టి బుర్రలో గట్టి ప్రశ్నలు

ఐదవ తరగతి చదువుతున్న కీర్తి వాళ్ళ అమ్మతో కలిసి కూరగాయల సంతకు వెళ్ళింది . అక్కడ దుకాణం ముందు పారవేసిన చెత్తను ఎత్తడం గురించి ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతున్నారు . "అమ్మా! వాళ్ళు చాలా చెద్దవాళ్ళు కదమ్మా " అని గొడవపడుతున్న వాళ్ళను చూసి అంది కీర్తి . ఎందుకలా అనుకుంటున్నావు అంది వాళ్ళ అమ్మ . దుకాణం ఎదురుగా చెత్త పారవేయడమే కాక అలా కొట్టుకుంటున్నారంటే చెడ్డవాళ్ళు అనే కదా అని కాస్త గట్టిగా చెప్పింది కీర్తి . కీర్తి మాటలు దుకాణం పక్కనే ఉన్న మనిషి విని వీళ్ళ వైపు తిరిగి చూశాడు. అతనేమంటాడో అని కీర్తి వాళ్ళ అమ్మ కాస్త కంగారుపడింది . అతను కీర్తిని చూసి చిన్నగా నవ్వేసరికి హమ్మయ్య అనుకుంది .కీర్తిని కొంచెం సమాధానపరచడానికి చూసి " మనుషులందరూ మంచి వాళ్ళే కీర్తి ! కొన్ని సమయాల్లో వారి ప్రవర్తన వాళ్ళ చేతుల్లో ఉండదు.కాలమే వారిని చెడుగా ప్రవర్తించేలా చేస్తుంది' అని చెప్పింది అమ్మ . తనకిష్టమైన మొక్కజొన్న కంకులు కనపడగానే కీర్తి దృష్టి అటు వైపు వెళ్ళిపోయింది . తమకు కావాల్సినవి కొనుక్కుని ఇంటిదారి పట్టారు తల్లీకూతురు .

ఇంటికెళ్లాకా చెల్లెలితో ఆడుకుంటూ బొమ్మలకు కీర్తి గొడవపడుతుంటే అమ్మ కీర్తిని పిలిచి " చెల్లెలు నీకన్నా చిన్నది కదా! దానితో గొడవ పడకుండా చక్కగా ఆడుకోవాలిగానీ కొట్టుకుంటారా ? ఇలా చేస్తే అందరూ మిమ్మల్ని చూసి వీళ్ళు మంచి పిల్లలు కాదు" అంటారు అని మందలించింది వాళ్ళ అమ్మ . " అమ్మా ! నేను కావాలని అలా చేయలేదు. కాలమే నాతో అలా అల్లరి చేసేలా చేసింది" అని ఠక్కున అంది కీర్తి .ఇందాక సంతలో చెప్పిన సంగతి గుర్తుపెట్టుకుని ఇలా సమాధానం చెప్పిందని తల్లికి అర్ధమయ్యింది .

కీర్తి సమయస్ఫూర్తికి మనసులోనే మెచ్చుకున్నా " నీకు రాముడు



కథ చాలా ఇష్టం కదా ! అందులో తండ్రికి ఇచ్చిన మాట కోసం రాముడు అడవులకి వెళ్లి చాలా కష్టాలు పడ్డాడు . అలా కాకుండా తండ్రి మాట లెక్కచేయకుండా ఉండి ఉంటే ఈ కష్టాలన్నీ పడేవాడు కాదు " అని తల్లి చెప్తుండగా మధ్యలో ఆపి కీర్తి " అలా చేయడం తప్పు కదా మరి ? " అంది . "రాముడికి ఎదురయినట్టుగానే అందరికి మంచి చెడు రెండు దారులు ఉంటాయి .మనం ఏది ఎంచుకోవాలో మన చేతిలోనే ఉంటుంది . మంచి దారిలో నడవడం ఎప్పుడూ కష్టంగానే ఉంటుంది " అని ఇంకా ఏదో చెప్పబోతున్న తల్లిని మళ్ళీ ఆపి " హీరో ఎంత పెద్ద కష్టాన్ని దాటితే అంత గొప్పవాడవుతాడు" అని సినిమాలో డైలాగ్ చెప్పేసరికి తల్లి నవ్వుతూ " శ్రీరాముడు ఎన్ని యుగాలైనా గొప్పవాడే! అందుకే మనందరికీ ఇష్టమైన దేవుడయ్యాడు " అంది. కీర్తికి ఇష్టమైన రాముడిని ఉదాహరణగా చెప్పేసరికి కాస్త సమాధానపడింది. మర్నాడు ఆ చిట్టి బుర్ర వేసే గట్టి ప్రశ్నలకు సిద్ధమవుతూ నిద్రపోయింది తల్లి.

డా.చేరుకుపల్లి హారిక
9000559913

# తెలంగాణలో బోనాల వేడుకలు...

తెలంగాణకే ప్రత్యేకమైన పండుగలలో బోనాల పండుగ కూడా ఒకటి. ఆషాఢ మాసంలో ఈ బోనాల పండుగ తెలంగాణ ప్రాంతాలలో ఆనందంగా జరుపు కుంటారు. గ్రామదేవతల పూజలకు ఉద్దేశిత మైనది, తెలుగు జానపదుల సాంస్కృతిక విభవానికి ఉత్తుంగ శిఖరంలా నిలుస్తున్నది బోనాల పండుగ. ఇది తెలంగాణ సాంప్రదాయాల ప్రత్యేకతను, విశిష్టతను చాటిచెప్పే పండగ. ప్రాచీన కాలంలో ఋతువులు మారి, ఆషాడంలో వర్షాలు కురిసి, వాతావరణ మార్పులతో, కలరా ప్లేగు లాంటి మహమ్మారి వ్యాధులు సంక్రమించే క్రమంలో, వైద్య సౌకర్యాలు లేని స్థితిలో, దేవతలను కొలవడం జరిగేది.

1813 లో భాగ్యనగరంలో వేలాది మంది గురైన సందర్భంలో, మహంకాళిని కొలవడం వల్ల వ్యాధి తగ్గుముఖం పట్టిందని, అప్పటి నుండి రాష్ట్ర రాజధాని లోనూ, బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు వాడుక. గోల్కొండ కోటలో జగదాంబికా ఆలయంలో, అబుల్ హసన్ తానీషా పాలనా సమయంలో, ప్రధాని సైనికాధికారులుగా ఉన్న అక్కన్న, మాదన్నల కాలంలో, బోనాల ఉత్సవాలు ప్రారంభమైనట్లు కథనాలు. 1908లో మూసీకి వరదలు వచ్చినప్పుడు, నిజాం మీర్ మెహబూబ్ అలీ ఖాన్, మంత్రి కిషన్ ప్రసాద్‌ను, ఏమి చేయాలని సలహా కోరగా, ఇది అమ్మవారి ఆగ్రహం ఫలితమేనని, ఆమెను శాంతింప చేయడానికి, పూజలు నిర్వహించాలని మంత్రి, ప్రభువుకు వివరించిన సందర్భంలో, నిజాం ప్రభువు లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, ముత్యాలు, పట్టు వస్త్రాలు, సమర్పించి పూజలు నిర్వహించిన ఫలితంగా, వరదలు తగ్గుముఖం పట్టాయని చెబుతారు. తర్వాత కాలంలో, స్థానికులు సదరు ఆలయాన్ని పునరుద్ధరించి, 1968లో కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురువులచే, విగ్రహ ప్రతిష్ట చేయించడం జరిగింది. 7వ నిజాం కాలం నుండి, సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయం లో, బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ లో ప్రస్తుతం వందలాది చిన్న, పెద్ద ఆలయాలలో ఉత్సవాలు కొనసాగు తున్నాయి. 1676లో కరీంనగర్ హుస్నాబాద్‌లో ఎల్లమ్మగుడిని సర్వాయి పాపన్న కట్టించి, ఆ దేవతకు బోనాలు సమర్పించినట్టు కైఫీయతుల్లో గౌడనాడులు గ్రంథంలో ఉంది.

భోజనం ప్రకృతి అయితే.. దాని వికృతి పదమే బోనం. అన్నం, పాలు, పెరుగుతో కూడిన బోనాన్ని అమ్మవారి కోసం మట్టి లేక రాగికుండలో వండుతారు. ఆ తర్వాత బోనాల కుండలను వేప రెమ్మలతో, పసుపు, కుంకుమతో అలంకరించి దానిపై ఒక దీపం ఉంచుతుంటారు. ఇలా తయారు చేసిన బోనాలను తలపై పెట్టుకుని డప్పు చప్పుళ్లతో మహిళలు ఆలయానికి తీసుకెళ్తారు. ఈ బోనాల కుండలను ఇలా బోనం నైవేద్యంగా సమర్పించే తంతును ఊరడి అంటారు. గ్రామాల్లో దీన్నే పెద్ద పండుగ, ఊర పండుగ వంటి పేర్లతో పిలుస్తారు. బోనాల జాతర కేవలం అమ్మవారికి నైవేద్యం సమర్పించడంతోనే ముగిసిపోదు. గ్రామీణ సంబురాలకు సంబంధించిన ప్రతి ఘట్టమూ ఇందులో కనిపిస్తుంది. తొట్టెల పేరుతో అమ్మవారికి కర్రలు, కాగితాలతో చేసిన అలంకారాలు సమర్పించడం, రంగం పేరిట భవిష్యవాణి చెప్పే ఆచారమూ ఈ బోనాల పండుగలో ఉంటుంది.

అమ్మవారిని ఘటం రూపంలో స్థాపించడం, ఆ ఘట్టాన్ని నిమజ్జనం చేయడమూ జరుగుతుంది. జానపద కళలు, డప్పుల



చప్పుళ్లు, శివసత్తుల విన్యాసాలతో పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఆషాడ మాసంలో అమ్మవారు తన పుట్టింటికి వెళుతుందని గ్రామీణుల విశ్వాసం. అందుకే తమ కూతురు తమ సొంత ఇంటికి లేదా ఆమె పుట్టింటికి వచ్చిన భావనతో ప్రేమానురాగాలు, పుట్టి పడగా, భక్తిశ్రద్ధలను మేళవించి, బోనాలను నివేదిస్తారు.

పండుగ మొదటి రోజు నుండి, చివరి నిమజ్జనం దాకా, అత్యంత భక్తి తత్పరతతో వాతావరణం ఉంటుంది. బోనాల సమర్పణ వల్ల, ప్రధానంగా దేవతలు శాంతించి, అంటురోగాల బారిన పడకుండా కాపాడుతానని భక్తుల విశ్వాసం. వానాకాలంలో కలరా, మలేరియా వంటి ప్రమాదకరమైన అంటు వ్యాధులు త్వరగా వ్యాపిస్తాయి. సాధారణంగా ఈ అంటు వ్యాధులు క్రిమి కీటకాలతో పాటు ఇతర ప్రమాద జంతువుతో వచ్చే ప్రమాదంకూడా ఉంది. అందువల్ల ఆషాఢ మాసంలో ఈ బోనాల పండుగ జరుపుకుంటారు. వానాకాలంలో మహిళలకు అరి కాళ్ళకు అంటు వ్యాధులు సోకకుండా పసుపు పెట్టుకుంటారు.

జూన్ 30న గోల్కొండ అమ్మవారికి తొలి బోనం, మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, మేయర్ విజయలక్ష్మి పట్టువస్త్రాలు సమర్పించడంతో ఆషాడ బోనాలు ప్రారంభం కాగా, జులై 17న ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు, 18న రంగం, భవిష్యవాణి కార్యక్రమం నిర్వహించనున్నారు. జులై 24న భాగ్యనగర బోనాలు, 25న ఉమ్మడి దేవాలయాల ఘట్టాల ఊరేగింపు జరపనున్నారు. జులై 28న గోల్కొండ బోనాలతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి. ప్రతి ఆదివారం ఒక్కొక్క ప్రదేశంలో బోనాల జాతర జరుపబడుతుంది.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావ అనంతరం, తెలంగాణ సాంస్కృతిక వారసత్వ అనుసరణీయమైన పండగైన బోనాలను, "రాష్ట్ర పండుగ"గా నిర్వహిస్తున్నారు. బోనాలకు హైదరాబాద్ నగరం ప్రసిద్ధి చెందినప్పటికీ ,తెలంగాణ అంతటా ఈ పండుగను జరుపుకుంటారు. గ్రామ దేవతలకు పసుపు కుంకుమలు, చీరసారెలు, భోజన నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకుంటారు.

దేశరాజధాని ఢిల్లీలో ఏడేళ్లుగా మహంకాళి ఆలయ కమిటీ బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నది. వచ్చే ఏడాది నుంచి ఢీల్లీలో బోనాల ఉత్సవాలకు కేంద్రం నిధులు ఇస్తామని ఉత్సవాల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బోనాలు పండుగను కేంద్ర ప్రభుత్వ ప్రముఖ పండుగల జాబితాలో చేర్చేలా కృషి చేస్తానని కిషన్ రెడ్డి ఇదివరకే వెల్లడించారు. ఈసారి బోనాల ఉత్సవాల కోసం 15 కోట్లు కేటాయించి ఎంతో ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# జాతీయ చిహ్నంపై నిలదీస్తాం

## సార్నాథ్ స్థూపానికి భిన్నంగా ఎందుకు మండిపడుతున్న విపక్ష నేతలు

న్యూఢిల్లీ,జూలై13 : కొత్త పార్లమెంటు భవనంపై ప్రధాని మోదీ కాంస్య జాతీయ చిహ్నాన్ని ఆవిష్కరించడంపై రేగిన వివాదం మరింత ముదిరింది. దీనిపై ఊరుకునేది లేదని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ ప్రకటించారు. అసలు జాతీయ చిహ్నాన్ని ఇది





ప్రతిబింబించడం లేదని ప్రతిపక్షాలు ఆరోపించాయి. సార్నాథ్ స్థూపానికి భిన్నంగా ఎలా రూపొందిస్తారని అన్నారు. పాత చిహ్నంలో శాంతచిత్తంగా ఉండే సింహాలను.. కొత్త దాంట్లో ఉగ్రరూపంలో చూపించారని విపక్షలు ధ్వజమెత్తాయి. రానున్న పార్లమెంట్ సమావేశాల్లోగా దీనిని తొలగించాలని పట్టుబడుతున్నాయి. అయితే ఎలాంటి సవరణా చేయలేదని చిహ్నం శిల్పులు సునీల్ దేవరే, రొమిల్ మోజెస్ స్పష్టం చేశారు. కొత్త జాతీయ చిహ్నాన్ని కాంస్యంతో తయారుచేశారు. 9,500 కిలోల బరువున్న ఈ చిహ్నం ఎత్తు ఆరున్నర అడుగులు. క్రీ.పూ. 250 ప్రాంతంలో మౌర్య సామాజ్యంలో అశోక చక్రవర్తి.. వారాణసీలోని సార్‌నాథ్ వద్ద అశోక స్తంభంపై తామరపుష్పంలో ఉండే ఈ నాలుగు ఆసియా సింహాల చిహ్నాన్ని ఏర్పాటు చేసినట్లు చరిత్ర చెబుతోంది. తామర పుష్పం లేకుండా సింహాల చిహ్నాన్ని రాజ్యాంగ రూపకర్తలు 1950లో మన జాతీయ చిహ్నంగా తీసుకున్నారు. అందులోని అశోక చక్రాన్ని జాతీయ పతాకం నడుమన చేర్చారు. పాత పార్లమెంటు భవనంపై జాతీయ చిహ్నం ఉంది. తాజాగా రూపొందించిన జాతీయ చిహ్నాన్ని కొత్త పార్లమెంటు భవనంపై ప్రధాని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తమను ఆహ్వానించలేదని ప్రతిపక్షాలు ఆగ్రహంతో ఉన్నాయి. కార్యనిర్వాహక వర్గం అధినేతగా దానిని ఆయనెలా ఆవిష్కరిస్తారని నిలదీశాయి. పైగా చిహ్నంలో మార్పులు చేసి దానిని, రాజ్యాంగాన్ని అవమానించారని ఆరోపించాయి. అసలు జాతీయ చిహ్నంలో సింహాలు శాంతంగా ఉన్నాయని.. కొత్త చిహ్నంలో మనుషులను చంపే సింహాలుగా ఉన్నాయని ఆర్‌జేడీ ధ్వజమెత్తింది.జాతీయ చిహ్నంలో ఉగ్రసింహాలా అశోక సింహాలతో కూడిన జాతీయ చిహ్నానికే ఇది అవమానకరమని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ జవహర్ సర్కార్ ట్వీట్ చేశారు. 'పార్లమెంటు, జాతీయ చిహ్నం భారత ప్రజలందరివీ. ఒక్క మనిషి(మోదీ)కి చెందనవి కావు' అని కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్ పేర్కొన్నారు. రాజ్యాంగం చేసిన అధికార వికేంద్రీకరణను కార్యనిర్వాహక అధిపతి అయిన ప్రధాని నాశనం చేశారని సీపీఎం ధ్వజమెత్తింది. జాతీయ చిహ్నాన్ని మోదీ ఆవిష్కరించాల్సింది కాదని.. రాజ్యాంగ నిబంధనలను ఆయన ఉల్లంఘించారని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి అనిల్ బలూనీ అన్నారు. అయితే దీనిని సవరించి పాతపద్ధతిలోనే చూపాలని కాంగ్రెస కోరుతోంది. దీనిపై అన్ని పక్షాలతో కలసి నిలదీస్తామని అన్నారు.

# ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలి

## గ్రామాల్లో పారిశుధ్యం కోసం తోడ్పడాలి

జగిత్యాల,జూలై13 : గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. పారిశుద్ధ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వర్షాలతో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వర్షాలు బాగా పడుతున్నందున వచ్చే హరితహారం కార్యక్రమంలో ఇంటింటికి ఆరు నుంచి పది వరకు మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. చెరువులు, గ్రామపంచాయతీ కార్యాలయం, అటవీ, ప్రభుత్వ, ఎస్సారెస్పీ, కమ్యూనిటీ సెంటర్లు, హరితవనాలు, వైకుంఠ దామాల్లో, ఇనిస్టిట్యూషన్‌లలోని ఖాళీ స్థలాల్లో లక్ష్యానికి తగ్గకుండా మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిధిలో మూడు కిలో మీటర్ల రోడ్డుకు ఇరువైపులా, మొక్కలు నాటాలనీ, వర్షాలు పడే అవసరాన్ని బట్టి ఇంటింటికి ఆరు నుంచి పది వరకు మొక్కలు నాటేలా చూడాలని అన్నారు. చెరువులు, గ్రామపంచాయతీ కార్యాలయం, అటవీ, ప్రభుత్వ, ఎస్సారెస్పీ, కమ్యూనిటీ సెంటర్లు, హరితవనాలు, వైకుంఠ దామాల్లో, ఇనిస్టిట్యూషన్‌లలోని ఖాళీ స్థలాల్లో లక్ష్యానికి తగ్గకుండా మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బహిరంగ మల విసర్జన చేసినా, రోడ్లపై చెత్త వేసినా, నీటిని వృథా చేసిన వారికి అపరాధ రుసుము విధించనున్నట్లు పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంబంధిత ప్రత్యేక అధికారులు సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. మొక్కలు చనిపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలనీ, మొదట ఐదు మండలాలను ఎంపిక చేసుకొని ఆయా గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. డ్రెయినేజీలను శుభ్రపరచాలనీ, ముళ్లపొదలు, రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు లేకుండా చూడాలన్నారు. ఇంటింటా ఇంకుడు గుంత నిర్మించుకునేలా చూడాలనీ, ఇండ్లలోని వృథా నీటిని ఇంకుడుగుంతల్లోకి వెళ్లేలా అవగాహన కల్పించాలన్నారు.

# తక్షణ చర్యలు తీసుకోండి

మొదటిపేజీ తరువాయి..

అవకావం ఉందని వాతావరణశ్శాఖ హెచ్చరించింది. భారీ వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. రేపటి నుంచి ఈనెల 17వరకు పలు రైళ్లను రద్దు చేసినట్లు వెల్లడించింది. సికింద్రాబాద్- ఉందానగర్-సికింద్రాబాద్ ప్యాసింజర్ రైలు, సికింద్రాబాద్-ఉందానగర్ మెము రైలు, మేడ్చల్-ఉందానగర్ మెము ప్రత్యేక రైలు, ఉందానగర్-సికింద్రాబాద్ మెము స్పెషల్ రైలు, సికింద్రాబాద్- ఉందానగర్ మెము స్పెషల్ రైలు, హెచ్.ఎస్ నాందేడ్-మేడ్చల్-హెచ్ఎస్ నాందేడ్, సికింద్రాబాద్-మేడ్చల్ మెము రైలు, మేడ్చల్-సికింద్రాబాద్ మెము రైలు, కాకినాడ పోర్టు-విశాఖపట్నం మెము రైలు, విజయవాడ- బిట్రగుంట మెము రైళ్లను రద్దు చేశారు. ఈనెల 14 నుంచి 17 వరకు 34 ఎంఎంటీఎస్ సర్వీసులు రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. లింగంపల్లి-హైదరాబాద్ రూట్‌లో 9 సర్వీసులు, హైదరాబాగ్-లింగంపల్లి మార్గంలో 9, ఫలక్‌నుమా-లింగంపల్లి మధ్య 7 సర్వీసులు, లింగంపల్లి -ఫలక్‌నుమా రూట్‌లో 7 సర్వీసులు, సికింద్రాబాద్-లింగంపల్లి రూట్‌లో ఒకటి, లింగంపల్లి సికింద్రాబాద్ మార్గంలో ఒక సర్వీసు రద్దు చేశారు. ఉ ందానగర్- మేడ్చల్ మెము స్పెషల్, సికింద్రాబాద్-బొల్లారం మెము స్పెషల్, బొల్లారం-సికింద్రాబాద్ మెము స్పెషల్,

రవాణా, విద్యుత్ తదితర సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖలు చేపడుతున్న చర్యలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. గోదావరి నదిపై ఉన్న కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత వరకు దిగువకు నీటిని విడుదల చేస్తున్నా.. ఇంకా వరద పెరుగుతుందని సీఎంకు అధికారులు వివరించారు. కడెం ప్రాజెక్టు కింద 12 గ్రామాల ప్రజలను ఖాళీ చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడే ఉండి రక్షణ చర్యల్లో నిమగ్నమైన మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి సీఎం కేసీఆర్ ఫోన్ చేసి తగు ఆదేశాలు జారీ చేశారు. నిర్మల్‌తో పాటు వరద ముంపునకు గురవుతున్న ఇతర ప్రాంతాలను గుర్తించి.. తక్షణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్‌ను సీఎం ఆదేశించారు. వరదలకు తెగిపోతున్న జాతీయ, రాష్ట్ర రహదారుల పునరుద్ధరణకు సత్వర చర్యలు చేపట్టాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని కేసీఆర్ ఆదేశించారు. ఎక్కడా కూడా ప్రాణహాని జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఎస్, ఇరిగేషన్ అధికారులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం ఆదేశాలిచ్చారు. భద్రాచలంలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ను అక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ముంపు ప్రాంతాల ప్రజలను తక్షణమే ఖాళీ



మేడ్చల్-సికింద్రాబాద్ మెము స్పెషల్, సికింద్రాబాద్-మేడ్చల్ మెము స్పెషల్ రైళ్లను ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు రద్దు చేశారు.

అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాష్ట్రంలో వర్షాల వల్ల విద్యుత్తు సరఫరాకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని, విద్యుత్ ఉత్పాదనకు మరో నెల రోజులకు సరిపడా బొగ్గును నిల్వచేసు కోవాలని విద్యుత్ శాఖ సీఎండీలు ప్రభాకర్ రావు, రఘుమారెడ్డి, సింగరేణి సిఎండీ శ్రీధర్‌లను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ఇప్పటివరకు 2300 వరకు విద్యుత్తు స్థంభాలు కూలిపోతే 1600 వరకు పునరుద్దరణ చేపట్టామని, మిగతా పునరుద్దరణ పనులు పురోగతిలో ఉ న్నాయని విద్యుత్ శాఖ అధికారులు వివరించారు. విద్యుత్‌కు అంతరాయాలు ఏర్పడ్డ చోట తక్షణమే ప్రత్యామ్నాయ సౌకర్యాలద్వారా విద్యుత్‌ను పునరుద్ధ రిస్తున్నట్టు సీఎం కేసీఆర్‌కు సీఎండీ రఘురామారెడ్డి వివరించారు. ప్రాజెక్టులకు చేరుకుంటున్న వరదను బట్టి అవకాశమున్న చోట హైడల్ ప్రాజెక్టులను ప్రారంభించాలని సీఎం సూచించారు. వరదల నేపథ్యంలో రాష్ట్రంలో ముంపునకు గురైన పంటలు, చెరువులకు గండ్లు పడుతున్న పరిస్థితి గురించి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్ రెడ్డితో కేసీఆర్ సమీక్షించారు. వరదలు తగ్గగానే వెంటనే కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని సీఎం ఆదేశించారు. వానలు, వరదల నేపథ్యంలో చేపట్టిన రక్షణ చర్యలకు కావాల్సిన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కేసీఆర్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా తలెత్తుతున్న సమస్యలపై ఎప్పటికప్పుడు తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎస్, డీజీపీలను సీఎం ఆదేశించారు. వానలు, వరదల నేపథ్యంలో అత్యవసరమైతే తప్పితే ప్రజలెవరూ కూడా బయటకు వెళ్లొద్దని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు.దేవాదుల ప్రాజెక్టుల పనులు పురోగతిలో ఉన్న నేపథ్యంలో వరదనీరు చేరుకోవడంతో తక్షణ చర్యలు చేపట్టి వరద నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు తీసుకోవాలని ఈఎన్సీ మురళీధర్ రావును సీఎం ఆదేశించారు.

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు, రిజర్వాయర్లు, నదులు పొంగిపొర్లుతున్నాయి. ఈ క్రమంలో వర్షాలు, వరదల పరిస్థితిపై సీఎం కేసీఆర్ ఉన్నతాధికారులతో ప్రగతి భవన్‌లో సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజా ప్రతినిధులను సీఎం అప్రమత్తం చేశారు. తక్షణ రక్షణ చర్యలను కొనసాగిస్తూ.. వరదలవల్ల కలిగే ఆస్తి, ప్రాణ నష్టాలను వీలయినంతమేర తగ్గించాలని సీఎం సూచించారు. ఎగువన కురుస్తున్న భారీ వానల నేపథ్యంలో అటు కృష్ణా, ఇటు గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా గోదావరి నది హెచ్చరికలు దాటి ప్రవహిస్తుంది. ఈ నేపథ్యంలో ఎస్సారెస్పీ వంటి పలు రిజర్వాయర్లకు సంబంధించిన ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లోల గురించి సీఎం ఆరా తీశారు. ఇరిగేషన్ అధికారులకు కేసీఆర్ తగు ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చేపట్టిన చర్యలను సీఎం ఆరా తీశారు. మహారాష్ట్ర ఎగువ గోదావరి నుంచి వరదను అంచనా వేసి చర్యలు చేపట్టాలని అధికారులకు ఫోన్‌లోనే సీఎం ఆదేశాలు ఇస్తున్నారు. వరదల వల్ల

చేయించాలని సూచించారు. వరద ముంపు అధికంగా వున్న జిల్లాల మంత్రులు, కలెక్టర్లు, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో సీఎం కేసీఆర్ ఫోన్లో మాట్లాడారు. పరిస్థితులు చక్కబడేవరకు వారి వారి నియోజకవర్గాలు, జిల్లాలు విడిచి వెళ్లరాదని మరోమారు సంబంధిత జిల్లాల మంత్రులను, ఎమ్మెల్యేలను సీఎం కేసీఆర్ ఆదేశించారు. కుండపోత వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రాష్ట్రానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురవనుండగా.. మరికొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉ ందని హెచ్చరించింది. కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల ,రాజన్న సిరిసిల్ల, కరీంనగర్,పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్ అర్బన్..రూరల్, జనగాం జిల్లాలోని పలు ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు నమోదవుతాయని చెప్పింది. వర్షాల నేపథ్యంలో తెలంగాణలో విద్యాసంస్థలకు సెలవులను ప్రభుత్వం పొడగించింది. భారీ వర్షాలు మరో మూడు రోజులు కొనసాగు తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో..సెలవులను శనివారం వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఆదివారం సెలవు కావడంతో తిరిగి సోమవారం విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. పలు యూనివర్సిటీల పరిధిల్లో పలు పరీక్షలను వాయిదా వేశారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో గురు, శుక్రవారాల్లో జరగాల్సిన పీజీ రెండో సంవత్సరం పరీక్షలను వాయిదా వేశారు. వాయిదా పడిన పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో గురువారం నుంచి ఈ నెల 16వ తేదీ వరకు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసినట్లు అధికారులు వెల్లడించారు. వాయిదా పడిన పరీక్షల షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. జేఎన్టీయూ హైదరాబాద్ పరిధిలో బీటెక్, బీ ఫార్మసీ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు, మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ సెకండ్ మిడ్ టర్మ్ ఎగ్జామ్స్‌ను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వాయిదా పడ్డ పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు. జులై 21 నుంచి జరగాల్సిన పరీక్షలు యథాతథంగా జరుగుతాయని స్పష్టం చేశారు. భద్రాచలంలో గోదావరి కనీవినీ ఎరుగని రీతిలో ప్రవహిస్తోంది. ఇప్పటికే 50 అడుగులు దాటిన గోదావరి నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 60 అడుగులకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం 53 అడుగులు దాటడంతో జిల్లా కలెక్టర్ అనుదీప్ మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ ప్రాంతం సమ్మక్క బ్యారేజ్ నుంచి పెద్ద ఎత్తున వరద ప్రవాహం వస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భద్రాచలం నుంచి చర్ల, వాజేడు, వెంకటాపురం, వీఆర్ పురం, కూనవరం, చింతూరు మండలం వైపు రాకపోకలు స్తంభించాయి.ఇకపోతే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మిడ్ మానేర్ ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం 56,506 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది.

## ఉచితంగా బూస్టర్ డోస్

మొదటిపేజీ తరువాయి..

జనవరి నుంచి కరోనా వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే చాలా మంది రెండు డోసుల




వ్యాక్సిన్ తీసుకున్నారు. రెండు డోసులు కేంద్రమే ఉచితంగా ఇవ్వగా.. కొంత మంది డబ్బు చెల్లించి మూడో డోస్‌ను వేయించుకున్నారు. తాజాగా కేంద్రం తీసుకున్న నిర్ణయంతో బూస్టర్ డోస్ ఫ్రీగా ఇవ్వనున్నారు. దేశంలో ఇప్పటి వరకు 199 కోట్లకు పైగా డోసుల కరోనా వ్యాక్సిన్ అందజేశారు. నిత్యం 11 లక్షల మందికి టీకాలు వేస్తున్నారు. మూడో డోసు ఫ్రీగా వేయనుండడంతో.. వ్యాక్సినేషన్ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. దేశంలో ప్రస్తుతం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. మంగళవారం 15,447 మంది కొత్త ఈ వైరస్ బారిన పడ్డారు. ప్రస్తుతం దేశంలో 1,32,457 కరోనా యాక్టివ్ కేసులున్నాయి.

## తెలంగాణ సమాజం యావత్తు జాగరూకతతో ఉండాలి

మొదటిపేజీ తరువాయి..

యావత్తు జాగరూకతతో ఉండాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. లేకపోతే జర్మన్ కవి చెప్పినట్లుగా హిట్లర్ కాలంలో నాజీలు మనకోసం వచ్చేవరకు కూడా మేల్కోలేని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కాగా.. మతం రాజకీయ పార్టీ ముసుగు వేసుకొని వస్తే అది దేశాన్ని గందరగోళ పరుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో.. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించేవారు పుడుతుంటారని.. ప్రస్తుతం కేసీఆర్ ఎదురు తిరిగాడని.. దేశమంతా ప్రశ్నించే గొంతులు పెరుగుతాయని ఆయన అన్నారు. అయితే.. తెలంగాణ చరిత్రను, పోరాటాన్ని, జరిగిన ఉద్యమాలు.. ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం.. జాతరలు పండుగలు అనేకాంశాలను గ్రంథస్థం చేసిన ప్రొఫెసర్ లను అభినందించారు. ఈనేపథ్యంలో.. కులమత సంకెళ్లలో చిక్కుకుంటే దేశం పురోగమించలేదని.. మానవ సంపదైన యువతరం సెక్యులర్ భావాలతో ఎదగాలని, అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తూ దూసుకుపోవాల్సిన సమయంలో కుల, మత ప్రస్తావనల్లో కొట్టుకపోతే.. అదిదేశానికి తీవ్ర నష్టాన్ని చేకూర్చుతుందన్న ఆందోళనను వ్యక్తం చేశారు కేటీఆర్. అంతేకాకుండా.. ప్రపంచ చరిత్రలను అధ్యయనం చేస్తున్న విద్యార్థులు ప్రస్తుతం దేశంలో జరుగుతున్న అవాంఛనీయ సంఘటనలపై దృష్టి పెట్టాలన్నారు. కాగా.. దేశంలో మానవత్వంపై దాడి జరుగుతున్నప్పుడు ఆలోచన పరులైన యువతరం స్పందించాలన్నారు.

అయితే.. యువతరం చరిత్ర తెలుసుకోవాల్సిన అవసరం వున్నదని.. లేకపోతే కులం, మతం పేరుతో కొట్లాడుకునే విష వలయాలలో చిక్కుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి ఛైర్మన్ జూలూరు గౌరీశంకర్, గ్రంథ రచయితలు ప్రొఫెసర్ జీ లక్ష్మణ్, ప్రొఫెసర్ మాదాడి వెంకటేశ్వరరావు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి కోయ చంద్రమోహన్ లు పాల్గొన్నారు.

## శ్రీలంకలో ఆగని ఆందోళనలు

మొదటిపేజీ తరువాయి..

దేశవ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉ ధృతమయ్యాయి. పార్లమెంట్ ముట్టడికి జనాలు కదిలి వస్తుండడంతో ఎమర్జెన్సీ పరిస్థితిని విధిస్తున్నట్టు రణిల్ విక్రమసింఘే పేర్కొన్నారు. కొలంబో సహా పశ్చిమ ప్రావిన్స్‌లో నిరవధిక కర్ఫ్యూ విధిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆందోళనలను అదుపులోకి తీసుకొచ్చేందుకే ఈ ఆందోళన సృష్టించారు. దీంతో ఆర్మీ సైతం రంగంలోకి దిగి... కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. అయినప్పటికీ నిరసనకారులు లోనికి చొచ్చుకురావడంతో.. సైనికులు భాష్ప వాయువును ప్రయోగించారు. ఈ క్రమంలోనే నిరసనకారులు పోలీసుల వాహనాలపైకి రాళ్లు రువ్వగా.. పరిస్థితిని అదుపు చేసేందుకు పోలీసులు గాల్లో కాల్పులు జరిపారు. వేల



నిర్ణయం తీసుకున్నట్టు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. కాగా మాల్దీవులకు పారిపోయిన గొటబాయ రాజపక్స తక్షణమే రాజీనామా చేయాలని శ్రీలంకవాసులు డిమాండ్ చేస్తూ రోడ్డెక్కారు. ప్రధానమంత్రి కార్యాలయాన్ని చుట్టుముట్టారు. ప్రధాని కార్యాలయం ఆవరణ నుంచి వెళ్లిపోవాలని ఆందోళనకారులను భద్రతా బలగాలు హెచ్చరించాయి. దీంతో భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య తోపులాటలు జరిగాయి. సమూహాలను చెదరగొట్టేందుకు వాటర్ క్యానన్లు, బాష్పవాయు గోళాలను బలగాలు ప్రయోగించారు. శ్రీలంకలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం రోజురోజుకూ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ఈ క్రమంలో వేల సంఖ్యలో అక్కడి ప్రజలు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేస్తున్నారు. గొటబయకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొలంబోలోని అధ్యక్ష నివాసం వద్ద సంఖ్యలో అక్కడి ప్రజలు రోడ్ల పైకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాజీనామా చేయకుండా అధ్యక్షుడు గొటబాయ రాజపక్స దేశం విడిచి పారిపోయారు. మిలిటరీ విమానంలో మాల్దీవులు చేరుకున్నారు. బుధవారం ఉదయం మాలే నగరంలోని వెలానా ఎయిర్‌పోర్టులో ఆయన ప్రత్యక్షమయ్యారు. గొటబాయతోపాటు ఆయన సతీమణి, ఇద్దరు బాడీగార్డులు వెంటవున్నారు. మాల్దీవుల ప్రభుత్వ ప్రతినిధులు గొటబాయకు స్వాగతం పలికారు. మాలేలోని ఎయిర్‌పోర్టులో దిగాక పోలీస్ ఎస్కార్ట్‌తో రహస్య ప్రాంతానికి తరలించారు. మంగళవారం రాత్రి కొలంబో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి అధ్యక్షుడు గొటబాయ ఇద్దరు బాడీ గార్డులతో మిలిటరీ విమానం బయలుదేరినట్టు ఆ దేశ రక్షణశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

## ముర్ముకు మద్దతుగా ఉద్ధవ్ ప్రకటన

### మహా వికాస్ అఘాడి నేతల ఆగ్రహం

ముంబై,జూలై13: మహారాష్ట్రలో పొలిటికల్ వాతావరణం ఇంకా చల్లబడలేదు. ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపది ముర్ముకు శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మద్దతు తెలపడం మహా వికాస్ అఘాడిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఉద్ధవ్ థాక్రే నిర్ణయంపై కూటమి భాగస్వామి అయిన కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత బాలాసాహెబ్ థోరట్.. శివసేనపై సంచలన విమర్శలు చేశారు.

కాగా, బాలాసాహెబ్ ట్విట్టర్ వేదికగా.. శివసేన ఎందుకు ద్రౌపది ముర్ముకు మద్దతు ఇస్తుందో తెలపాలని డిమాండ్ చేశారు. ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ఇచ్చే ముందు ఎందుకు ఎంవీఏ కూటమితో చర్చించలేదని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని బేఖాతరు చేస్తూ అప్రజాస్వామిక పద్ధతిలో మహారాష్ట్రలో ఎంవీఏ సర్కార్‌ను కూల్చి, శివసేన ఉనికికే సవాల్ చేసిన బీజేపీ కూటమికి రాష్ట్రపతి ఎన్నికల్లో శివసేన ఎలా మద్దతు ఇస్తుందని ప్రశ్నించారు. మరో అడుగు ముందుకేసి.. రాష్ట్రపతి ఎన్నిక భిన్న సిద్ధాంతాల మధ్య పోరుగా మారిందని, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగాన్ని కాపాడేందుకు పోరాటం కోసం సాగుతోందని అన్నారు. అంతా వారి ఇష్టమేనా(శివసేన) అని పరోక్షంగా కామెంట్స్ చేశారు. ఇదిలా ఉ ండగా.. శివసేన వైఖరిపై అటు నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) సైతం ఆగ్రహం వ్యక్తం చేసింది. ద్రౌపది ముర్ముకు మద్దతిచ్చే విషయంలో ఎంవీఏకు శివసేన ముందస్తు సమాచారం ఇవ్వలేదని వెల్లడించింది. కాగా, మహారాష్ట్రలో శివసేన.. కాంగ్రెస్, ఎన్సీపీ భాగస్వామ్యంతో(ఎంవీఏ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

## తెలంగాణ చదువులకు చంద్రగ్రహణం

### ట్విట్టర్ ద్వారా రేవంత్ విమర్శలు

హైదరాబాద్,జూలై13: తెలంగాణలో పేద పిల్లల చదువుకు 'చంద్ర'గ్రహణం పట్టిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి ట్విటర్ వేదికగా విమర్శించారు. ప్రశ్నించకపోతే తెలంగాణ అజ్ఞానాంధకారం లోకి వెళ్లడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో పేద పిల్లల చదువులకు 'చంద్ర'గ్రహణం పట్టింది. ఉ పాధ్యాయులు లేక, పాఠ్యపుస్తకాలు లేక పాఠశాలలు వెలవెలబోతున్నాయి. 'మన ఊరు - మన బడి' ఓ ప్రచారార్భాటం. ప్రశ్నించకపోతే తెలంగాణ అజ్ఞానాంధకారంలోకి వెళ్లడం ఖాయం' అని రేవంత్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## హిందూ దేవతలను కించపర్చిన కేసీఆర్

### సుల్తాన్ బజార్ స్టేషన్లో బజరంగ్‌దళ్ ఫిర్యాదు

హైదరాబాద్,జూలై13: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై బజరంగ్ దళ్ నేతలు సుల్తాన్ బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దేవి దేవతలను కించపరుస్తూ సీఎం కేసీఆర్ మాట్లాడారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఇటీవల జరిగిన బహిరంగసభలో ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణలో ఉన్న ప్రముఖ దేవతలను కీర్తించారని, దీనిని రాజకీయంగా తప్పు పడుతూ జులై 10న నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సీఎం కేసీఆర్ హిందూ దేవతలను కించపరిచేలా వ్యాఖ్యానించారని వీహెచ్‌పీ పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని బజరంగ్ దళ్ నాయకుడు అభిషేక్ డిమాండ్ చేశారు. కేసీఆర్ పై వెంటనే కేసు నమోదు చేయాలని భజరంగ్ దళ్ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్ డిమాండ్ చేశారు. జోగులాంబ అమ్మవారిని కించపరిచే విధంగా చేసిన వాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. హిందు దేవతపై అలాంటి వ్యాఖ్యలు చేయడం సబబు కాదని, శక్తి పీఠం జోగులాంబ అమ్మవారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే హిందువులు సహించరన్నారు. రాజకీయాలు చేసుకోండి.. హిందు దేవతలను కించపరిస్తే సహించమని హెచ్చరించారు. గతంలో హిందుగాళ్ళు, బొందు గాళ్ళు అంటూ.. హిందువులను కించపరి చారని, కేసీఆర్ పై అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. హిందూ దైవాన్ని కించపరిచిన కేసీఆర్ పై కేసు నమోదు చేయాలని హైకోర్టు ను ఆశ్రయిస్తామని పండరీనాథ్ తెలిపారు. ఇటీవలే సీఎం కేసీఆర్ ప్రెస్ మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోడీపై పలు విమర్శలు గుప్పించారు.

## పోలీసు స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేసిన సైబరాబాద్ సీపీ

### సిబ్బందితో మాట్లాడిన సీపీ స్టీఫెన్ రవీంద్ర
### గుండెపోతుటో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

హైదరాబాద్,జూలై13: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ జోన్ షాద్ నగర్ డివిజన్ లోని పలు పోలీస్ స్టేషన్లను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా సీపీ కొత్తూరు, నందిగామ, షాద్ నగర్, కేశంపేట్ పోలీస్ స్టేషన్లను సందర్శించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సీపీ వెంట శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, షాద్ నగర్ ఏసీపీ కుషాల్కర్ ఉన్నారు. ఈ సందర్భంగా సీపీ పోలీసు స్టేషన్ల పరిసరాలను సందర్శించి పోలీసుస్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణపై నిశితంగా పరిశీలించారు. విధుల్లో భాగంగా పోలీసులు మెయింటేన్ చేసే రిసెప్షన్, జీడీ ఎంట్రీ తదితర ప్రతీ రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఫంక్షనల్ వర్టీకల్స్ వారీగా సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాల విషయంలో ప్రభుత్వం చేస్తున్న సూచనలను పాటించాలని తెలియజేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారం ప్రాధాన్యతగా విధులుండాలని ఆదేశించారు. పోలీసులు అంకితభావంతో విధులను నిర్వర్తించాలన్నారు. లా అండ్ ఆర్డర్, నేరాల నివారణ వ్యూహాలపై సీపీ గారు సిబ్బందితో చర్చించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు సరైన సమాచారాన్ని, ఆధునికతను ఉపయోగించి నేరస్తులను గుర్తించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలనన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. స్టేషన్ లోని సిబ్బంది, మహిళా పోలీస్ సిబ్బంది తో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. పోలీస్ సిబ్బంది దినచర్యలో వాకింగ్, షటిల్ ఏదైనా మీకిష్టమైన ఒక వ్యాయామాన్ని భాగంగా చేసుకుంటే ఫిట్ గా ఉంటారన్నారు. సమాయనుకూలంగా పోష్టికాహారము తీసుకోవడం, మంచి నిద్ర, వ్యాయామం, యోగా, మేడిటేషన్ తో ఒత్తిడిని జయించ వచ్చన్నారు. సిబ్బంది యొక్క ఆరోగ్య సమాచారాన్ని పేరుపేరునా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మారుతున్న నేరాల నమూనాకు అనుగుణంగా గస్తీ, పెట్రోలింగ్లను పెంచాలన్నారు. పోలీస్ స్టేషన్లలో క్రైమ్ పాట్రాన్స్, ట్రాఫిక్ పరిస్థితులు ఎట్లా ఉన్నాయి, సిబ్బంది సంక్షేమం వంటి విషయాలను నేరుగా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నేరాల నివారణకు, ట్రాఫిక్ దృష్ట్యా కచ్చితమైన నూతన ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. అలాగే రానున్న రోజుల్లో షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో అవసరమున్న ఆఫీసర్స్, కానిస్టేబుళ్లను త్వరలోనే నియమిస్తామని స్పష్టం చేశారు.

అదే విధంగా ట్రాఫిక్ సమస్య తమ దృష్టికి వచ్చిందని, దీనికి సంబంధించి పూర్తిస్థాయిలో ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. అంతే కాకుండా షాద్‌నగర్ జాతీయ రహదారిపై ప్రమాదాలను అరికట్టడంతో పాటు పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకై ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఒక సబ్ ఇన్ స్పెక్టర్ ర్యాంక్ అధికారితో బృందాన్ని ఏర్పాటు చేసి హైవే ప్యాట్రోల్స్ ను ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణీకుల భద్రత తో పాటు దారి దోపిడీలను అరికట్టవచ్చన్నారు.

కేశంపేట పోలీస్ స్టేషన్ లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులను నిర్వర్తించే జయప్రకాష్ (42) బుధవారం గుండెపోటు రావడంతో ప్రాథమిక చికిత్స కోసం కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం షాద్ నగర్ తరలిస్తుండగా మార్గ మధ్యంలో చనిపోయారు. విషయం తెలుసుకున్న సైబరాబాద్ సీపీ కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి సీపీ కానిస్టేబుల్ భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. కానిస్టేబుల్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చే సాయాన్ని అందిజేస్తామన్నారు.

## 69 మంది సీఐల బదిలీ

### ఉత్తర్వులు జారీచేసిన సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్,జూలై13: హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో భారీగా సీఐల బదిలీలు జరిగాయి. ఒకేసారి 69 మంది సీఐలను బదిలీ చేస్తూ సీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. కీలక పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న సీఐలను కూడా బదిలీ చేశారు. ఇటీవల పోలీసు కానిస్టేబుల్ బదిలీలు జరిగిన సంగతి తెలిసిందే.

## సిర్పూర్ పేపర్ మిల్లుకు వరదపోటు

### పంప్ హౌజ్ చుట్టూ చేరిన నీరు

ఆసిఫాబాద్,జూలై13: జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వానలతో సిర్పూర్ పేపర్ మిల్లు పంప్‌హౌస్ చుట్టూ వరద నీరు చేసింది. దీంతో ఎనిమిది మంది కార్మికులు పంప్‌హౌస్‌లో చిక్కుకుపోయారు. పెద్దఎత్తున నీరు నిలిచిని నేపథ్యంలో విధుల నుంచి కార్మికులు ఇంటికి చేరుకోకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అయితే కార్మికులంతా సురక్షితంగానే ఉన్నారని సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం ప్రకటించింది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. పంప్‌హౌస్ చుట్టూ నీరు నిలిచిపోవడంతోనే వారు బయటకు రాలేకపోయారని వెల్లడించారు. వారితో తాము నిరంతరం టచ్‌లో ఉన్నామని చెప్పారు.

## మంజీరా నదిలో పెరిగిన వరద ఉధృతి

### సాలూరా వద్ద రహదారి మూసివేత

నిజామాబాద్,జూలై13: మంజీరా నదిలో వరద ఉధృతి పెరగటంతో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో సాలూర ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్ద అంతరాష్ట్ర రహదారిని మూసివేశారు. మంజీరాకు అవతల వైపు మహారాష్ట్ర పోలీసులు కూడా ఇరు రాష్ట్రాల మధ్య రాకపోకలపై ఆంక్షలు విధించారు. బోధన్ మండలంలోని కాంగ్వావ్ గ్రామం వద్ద ఇరు రాష్ట్రాల మధ్యన ఉన్న వంతెనపై రాకపోకలను నిషేధించారు. కాగా, సాలురా వద్ద గల పాత బ్రిడ్జి పైనుంచి వరద ప్రమాదకరరీతిలో ప్రవహిస్తుండటంతో మంజీరా తీరప్రాంతంలోని గ్రామాలు జలమయమయ్యాయి.



## ఆహార భద్రత కార్డుల తొలగింపు పై విచారణ

**హుస్నాబాద్ జూలై 13 (ప్రజామంటలు):** సుప్రీంకోర్టు నందు ఆహార భద్రత

'ATEMENT SHOWING THE DAILY REPORT FOR VERIFICATION OF DELETED FOOD SECURITY CARDS, Dated: 13.07.2022

| Divison | Mandal | Total cards | Units/ members for verification | | | | |
|---|---|---|---|---|---|---|---|
| | | | Total to be verified (Target) | verified upto yesterday | Today verfied | so far verified | Balance |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8=(6+7) | 9=(5-8) |
| Husnabad | Akkannapet | 392 | 640 | 176 | 49 | 225 | 415 |
| Husnabad | BEJJENKI | 502 | 911 | 45 | 141 | 186 | 725 |
| Husnabad | HUSNABAD | 424 | 737 | 142 | 45 | 187 | 550 |
| Husnabad | KOHEDA | 569 | 1148 | 127 | 195 | 322 | 826 |
| Husnabad | Maddur | 99 | 159 | 98 | 28 | 126 | 33 |

కార్డులు, మరణించినవారు, గ్రామాల్లో లేని వారి పేర్లు తొలగింపుపై దాఖలైన పిటిషన్ ను స్వీకరించిన సుప్రీంకోర్టు 2016 నుండి నేటివరకు ఆహారభద్రత కార్డుల నుండి తొలగించిన పేర్లను విచారణ చేయవలసిందిగా సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో హుస్నాబాద్ డివిజనల్ లో ఆర్డీవో జయచంద్ర రెడ్డి డివిజన్ లోని ఆరు మండలాల రెవెన్యూ సిబ్బంది ఆహార భద్రత కార్డుల పేర్ల తొలగింపుపై విచారణ జరుపుతున్నట్లు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## కొత్త చెరువుకట్ట కోతను పరిశీలించిన ఆర్డిఓ జయ చంద్రారెడ్డి



**హుస్నాబాద్ జూలై 13 (ప్రజామంటలు):** హుస్నాబాద్ పట్టణంలో కొత్త చెరువు కట్ట కోతకు గురి అవుతుందన్న సమాచారంతో హుస్నాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి జయచంద్ర రెడ్డి మరియు ఈఈ రాములు చెరువు కట్టను పరిశీలించారు. మిషన్ కాకతీయ లో భాగంగా పూడిక తీసినందున చెరువు కట్టకు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. అలాగే చెరువు నిండి మత్తడి పోస్తునందున రెవెన్యూ మరియు ఇరిగేషన్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీరితో స్థానిక తహసిల్దార్ మహేష్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



చౌదారం వ్యవస్థాపకులు ముక్క విష్ణు వర్ధన్ పుట్టినరోజు గ్రామంలో మొక్కలు నాటారు. పాల్గొన్న గ్రామ పంచాయతీ కార్యదర్శి కన్న రాజు, తెలంగాణ నవ సమాజ్ పార్టీ అధ్యక్షులు యాసారపు కరుణాకర్, యసారపు యుగేందర్, సిద్ధిలింగం గౌడ్, యసారపు కృష్ణంరాజు.

## నేడు సీతాఫల్ మండి లో ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ



**సికింద్రాబాద్ జులై 13 (ప్రజామంటలు):** నేడు జులై 14 గురువారం సీతాఫల్ మండి నామాలగుండు లోని బీ.ఎన్.ఆర్. గార్డెన్ లో బిల్డింగ్ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డులను బీజేపీ ఓబీసీ జాతీ య అధ్యక్షుడు, ఎంపీ డా.కే.లక్ష్మన్ పంపిణీ చేస్తారని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా భారతీయ జనతాపార్టీ జనరల్ సెక్రటరీ మేకల సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన కార్మికులు విచ్చేసి, వారి కార్డులు తీసుకువెళ్ళాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన ఈశ్రమ్ పథకంతో వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

## 1000 కోట్ల ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ సాధనకై లక్ష సంతకాల సేకరణ



**హన్మకొండ జూలై 13 (ప్రజామంటలు):** జిల్లాలో టిఏడియు (తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్) రాష్ట్ర కమిటి పిలుపు మేరకు 1000 కోట్ల ఆటో డ్రైవర్స్ కార్పొరేషన్ సాధన కోసం జిల్లాలో లక్ష సంతకాల సేకరణ ఈనెల 5 వ తేది నుండి సేకరిస్తున్నారు. ఈ క్రమంలో హన్మకొండ, వరంగల్ అద్యక్షులు నాయని రాజేందర్రెడ్డిని హన్మకొండలోని ఆయన నివాసంలో కలిసి తమ డిమాండు మద్దతు కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 22 మంది ఆటో డ్రైవర్ లు ఆత్మ బలిదానం చేసారని తెలిపారు. టీఆరెస్ ప్రభుత్వం ఏ మాత్రం న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయుని మాట్లాడుతూ, వీరి న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర అద్యక్షులు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెల్తానని, ఆటో డ్రైవర్స్ కు మద్దతు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి ఇమ్మడిశెట్టి రాజుతో పాటు తాడు ప్రతినిదులు పాల్గొన్నారు.

## మూడు బొమ్మల మేడిపల్లి గ్రామంలో చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

**మెట్ పల్లి జులై 13 (ప్రజామంటలు):** మెట్ పల్లి మండలం మూడు బొమ్మల మేడిపల్లి గ్రామంలోని చెరువుని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పరిశీలించారు. అనంతరం 63వ జాతీయ రహదారిపైకి చెరువు నీళ్లు వస్తుండటంతో అక్కడి పరిస్థితిని పరిశీలించి, ప్రయాణికులకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా ఉండే విదంగా చర్యలు చేపట్టాలని రెవిన్యూ అధికారులకు సూచించారు.



### భారీ వర్షాలు, ఈదురు గాలులతో

# దెబ్బతిన్న కరెంట్ పోల్స్, ఇండ్లు

- గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సర్పంచ్ సన్నీల్ల వెంకటేష్

**చిగురుమామిడి జూలై 13 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ సన్నీల్ల వెంకటేష్ గ్రామంలో విధివిధినా తిరుగుతూ కూలిపోయిన ఇండ్లను పరిశీలించి, ప్రమాదస్థిథిలో ఉన్న ఇండ్లలో ఉంటున్న వారికి జాగ్రత్తలు చెప్పుతూ వీధి వీధినా తిరిగారు. అదేవిధంగా రాత్రి భారీ వర్షానికి ఈదురు గాలులకు కరెంటు వైర్ల పై భారీ వృక్షం పడడంతో కరెంట్ పోల్ విరిగిపడడంతో గ్రామానికి కరెంట్ కట్ కావడంతో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సర్పంచ్ మాట్లాడి వెంటనే మరమ్మత్తులు చేపట్టి గ్రామానికి కరెంటు వచ్చే విధంగా మరమ్మతులు చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పూర్తిస్థాయిలో నేలమట్టమైన ఇండ్లలో ఉండడానికి కూడా వీలుకాని వారికి పునరాసంగా గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు అదేవిధంగా ఇంటి నుండి అత్యవసరం పరిస్థితి అయితేనే బయటికి వెళ్లాలని ప్రజలను కోరారు. అతని వెంట ఉప సర్పంచ్,



పాలకవర్గ సభ్యులు గ్రామ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# కొత్త చెరువుకు పొంచున్న ప్రమాదం

- చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న నూతన నిర్మాణాలు
- పర్మిషన్లు ఇస్తున్న మున్సిపల్ కమీషనర్

**హుస్నాబాద్ జూలై 13 (ప్రజామంటలు):** గత నాలుగు, ఐదు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్న కారణంగా హుస్నాబాద్ పట్టణంలోని కొత్త చెరువుకు మత్తడి పడి, కింద భాగంలో మత్తడి పక్కన ఉన్న కట్ట కూలీపోయి ప్రమాదకరంగా మారింది. భారీ వర్షాలతో కొత్త చెరువుకు మత్తడి పడి కింద భాగంలో కట్ట గండిపడి కొట్టుకోపోయి, ప్రమాదకరంగా మారి, కట్ట తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. 2016 వ సంవత్సరంలో కొత్త చెరువు కట్ట మరమ్మతు పనులకు రూ. 50 లక్షలతో 5 మీటర్ల వెడల్పుతో కట్టను, రూ.3 లక్షలతో మత్తడిని ఎత్తు పెంచకుండా నిర్మాణం చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని డ్రైనేజీ నీళ్ళు, అలాగే వర్షపు నీరు ఈ చెరువులోకి వచ్చి చేరుతుంది. ఈ సందర్భంగా భారీ వర్షాలు పడినప్పుడల్ల చెరువు నిండి దిగువ ప్రాంతంలోని వ్యవసాయ పొలాలు మొత్తం నిండి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి సారి భారీ వర్షాల కారణంగా హుస్నాబాద్ పట్టణంలోని నీళ్ళు ఇటు వైపు వచ్చి చెరువు నిండి దిగువ వైపు రైతులు నష్టపోతున్నారని తెలిసిన ఇంత వరకు సంబంధిత నీటీ పారుదల శాఖ అధికారులు ఈ మత్తడికి కాలువ కానీ, నీరు నిలువ ఉండే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం చూస్తే, అధికారుల యొక్క పని తీరు, నిర్లక్ష్యం, వైఫల్యం కొట్టోచ్చినట్టు కనపడుతుంది. గతంలో మున్సిపల్ కమీషనర్ కు కొత్త చెరువు ఎఫ్టీఎల్ పరిధిలోని ఎలాంటి నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వవద్దని పలు రాజకీయ పార్టీలు విజ్ఞప్తి చేసిన కానీ కమీషనర్, ఎఫ్టీఎల్ పరిధిలోని ఇండ్లు, ఇతర, ఫంక్షన్ హాల్ నిర్మాణాలకు, అక్రమ వెంచర్లు ఏర్పాటు చేసుకోవడానికి సహకరిస్తూ, పర్మిషన్ ఇస్తూ, ఇటు పట్టణాన్ని, అటు రైతులను ప్రమాదంలోకి నెట్టే పరిస్థితిని



తీసుకువచ్చారని పలువురు వాపోతున్నారు. వెంటనే నీటీ పారుదల శాఖ, మున్సిపల్ కమీషనర్, సంబంధిత అధికారులు స్పందించి, మరమ్మతు చర్యలు, చేపట్టి, మత్తడి ఎత్తును పెంచాలని, ఎఫ్టిఎల్ పరిధిలోని నిర్మాణాలను కూల్చివేయాలని, ఇచ్చిన పర్మిషన్లు రద్దు చేసి, కొత్త చెరువును కాపాడాలని పట్టణ ప్రజలు మరియు రైతులు కోరుతున్నారు.

# ఘనంగా గురుపౌర్ణమి ఉత్సవాలు

- హాజరైన మంత్రి తలసాని, సునీతా లక్ష్మారెడ్డి, రామచందర్ రావు

**సికింద్రాబాద్ జులై 13 (ప్రజామంటలు):** గురుపౌర్ణమి ని పురస్కరించుకొని పద్మారావు నగర్ లోని శ్రీ సాయి బాబా ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సాయి సప్తాహ మహోత్సవాలు బుధవారం గురుపౌర్ణమి రోజుతో ఘనంగా ముగిశాయి. ఉత్సవాల చివరి రోజు గురు పౌర్ణమి ని పురస్కరించుకొని బుధవారం ఉదయం సాయి కుమార్ బాబా శ్రీ షిరిడీ సాయి బాబా కు 108 కలశాల గోవు పాలతో మహాకుంభాభిషేకాన్ని నిర్వ హించారు,అనంతరం నవగ్రహ శాంతి కి, అపమృత్యు నివారణ కోసం నవగ్రహ పూర్వక మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. సాయంత్రం సాయికుమార్ బాబా వ్యాసపూజ, అనంతరం భక్తులకు దివ్య సందేశం అందించారు.

ప్రముఖుల హాజరు:

గురుపూర్ణిమ పర్వదినం సందర్భంగా సాయిబాబా



ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలకు రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, బీజేపి మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు, డివిజన్ కార్పొరేటర్ కుర్మా హేమలతలు హాజరయ్యారు.

# వరదల వల్ల నష్టం కలుగకుండా అన్ని చర్యలు

- సంక్షేమ శాఖల మంత్రి ఈశ్వర్

**ధర్మపురి జూలై 13 (ప్రజామంటలు):** గోదావరి వరదల వల్ల ఇలాంటి నష్టం కలుగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టి నట్లు సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ధర్మపురి లో బుధవారం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ జిల్లా కలెక్టర్ రవి, ఎస్పీ సింధూశర్మలతో కలిసి గోదావరి నది ప్రవాహాన్ని పరిశీలించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు గోదావరి పరివాహక ప్రాంతాల్లో కాలి నడకన వర్షంలో పర్యటించి అక్కడి ప్రజల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవాలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టనట్లు మంత్రి తెలిపారు. ఎస్సారెస్పీ, కడెం ప్రాజెక్టుల నుంచి భారీ స్థాయిలో నీటి విడుదల కొనసాగుతున్న నేపథ్యంలో తీరప్రాంత వాసులను సురక్షిత ప్రదేశాలకు తరలించడంలో వారు అధికారులకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేసారు. గౌరవ సీఎం కేసీఆర్ వర్షాల యొక్క పరిస్థితి అంచనా వేసి రాష్ట్రం లోని ప్రభుత్వ యంత్రాంగాన్ని అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఇచ్చిన ఆదేశాలతో జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రాణ నష్టం కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. రాయికల్ మండలంలోని బోర్నపల్లి వద్ద కుర్ర వాగు సమీపంలో ఐలాండ్ వద్ద చిక్కుకున్న 9 మంది వ్యవసాయ కూలీలను ఎన్డీఆర్ఎఫ్ బృందాల ద్వారా రక్షించామని, అయితే న్యూస్ కవరేజ్ లో భాగంగా ఎన్ టివి రిపోర్టర్ గల్లంతవడం చాలా బాధగా ఉందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు .జిల్లాలోమరో 3 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని , విపత్కర సమయంలో





అధికారులుకు ప్రజలు తమ సంపూర్ణ సహకారం అందించాలని మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్ రవి, ఎస్పీ సింధు శర్మ తమ ఆద్వర్యంలో చేపట్టిన చర్యల గురించి వివరించారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ చిట్టిబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ సత్తమ్మ, వైస్ చైర్మన్ రామయ్య, మార్కెట్ చైర్మన్ రాజేశ్, ఈఓ శ్రీనివాస్, కమిషనర్ రమేశ్, తహసీల్దార్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ఎంపీపీ జక్కుల అనితా రమేష్ యాదవ్

**భీమదేవరపల్లి జూలై 13 (ప్రజామంటలు):** వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా



పలు గ్రామాల్లో చేపట్టవలసిన చర్యలపై బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ జక్కుల అనితా రమేష్ యాదవ్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ%ొా%. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో మురుకునీటి కాలువలు నిండకుండా, నీరు బయటకు రాకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎక్కడైనా ఓవర్ హెడ్ సర్వీస్ మెయిన్ పైప్ లైన్ల నుండి నీటి లీకేజీ కాకుండా చూడాలన్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణంలో వరద నీరు రాకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం అమలు పరుస్తున్న పనులకు సంబంధిచిన ఏడు రిజిస్టర్స్ అప్డేట్స్ పై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగ రవి, ఏఈఈ ఆర్ డబ్ల్యు ఎస్ రాజామల్లారెడ్డి, ఎంపిఒ నాగరాజు, ఏపిఓ కుమారస్వామి, అన్ని గ్రామాల పంచాయతీ సెక్రటరీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ 320ఎఫ్ జిల్లా సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకటరెడ్డి పుట్టినరోజు పురస్కరించుకొని బుదవారం లయన్స్ క్లబ్ అబాద్ జనగామ ఆధ్వర్యంలో చంపక్ హిల్స్ లోని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రంలో రోగులకు బ్రెడ్ పాకెట్స్ పంపిణీ. పాల్గొన్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బచ్చు రమేష్, కార్యదర్శి గట్టు రాధాకృష్ణ, కోశాధికారి రేణుకుంట కృష్ణ , జిల్లా క్యాబినేట్ కార్యదర్శి నాగబండి రవీందర్, జిల్లా కోశాధికారి అల్లాడి ప్రభాకర్ రావు, జిల్లా కార్యదర్శి యామసాని శ్రీనివాస్.

## సోషల్ వెల్ఫేర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను కోరుట్ల నుండి జగిత్యాలకు మార్చండని వినతి

**జగిత్యాల జూలై 13 (ప్రజామంటలు):** జగిత్యాల నియోజకవర్గం కు కేటాయించిన సోషల్ వెల్ఫేర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలను కోరుట్ల నుండి జగిత్యాలకు



మార్చడానికి అనువైన భవనాన్ని కేటాయించాలని కోరుతూ బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని కలిసి వినతిపత్రాన్ని అందజేసిన ఓఎస్డి శర్మ, ఏఆర్సి ఓ సూర్య ప్రకాష్ రావు, ప్రిన్సిపాల్ లు శ్రీలత, అంకం సురేష్, అధ్యపకురాలు స్వప్న.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ సుధాకర్ రావు, సీనియర్ నాయకులు మనోహర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జగిత్యాల పట్టణ 29వ వార్డ్ కి చెందిన ఈరవెని గంగారాం ఇల్లు కూలిపోగా పరిశీలించి, ప్రమాదకరంగా ఉన్న మిగితా ఇంటిని వెంటనే డిస్మెంటల్ చేయించిన జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్. వారి వెంట స్థానిక కౌన్సిలర్ పంబాల రామ్, కమిషనేర్ స్వరూపరాణి, వైస్ చైర్మన్ గోలి.శ్రీనివాస్, బొడ్ల జగదీశ్, జవాన్, విష్ణు, మున్సిపల్ సిబ్బంది తదితరులు

## కేజీబీవిలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

### స్పెషల్ ఆఫీసర్ జ్యోతి

**భీమదేవరపల్లి జూలై 13 (ప్రజామంటలు):** మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్ ప్రవేశాలకు పదవ తరగతి ఉత్తీర్ణత పొందిన బాలికలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా స్పెషల్ ఆఫీసర్ జ్యోతి తెలియజేశారు. ఇంటర్ లో ఎంపీసీ, బీపీసీలలో ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలు ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి బోధన మరియు బోధనేతర రుసుము లేకుండా, ఉచిత హాస్టల్ సౌకర్యం మరియు నాణ్యమైన విద్య అందించ బడుతుందని తెలిపారు. అడ్మిషన్ల కోసం విద్యార్థినులు వివరాలను ఈ మొబైల్ నంబర్లలో 7207373205 , 8247281455 సంప్రదించాలని కోరారు.

## పదవి విరమణ ఆత్మీయ సన్మాన సభ వంట సహాయకురాలుకు ఘన సన్మానం

**చిగురుమామిడి జూలై 13 ( ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ వసతి గృహంలో వంట సహాయకురాలుగా విధులు నిర్వహిస్తున్న కెడం వెంకటమ్మ పదవి విరమణ





ఆత్మీయ సన్మాన సభ బుధవారం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ కొత్తవినిత శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఏ ఉద్యోగ కైనా పదవీ విరమణ తప్పదు అని విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినప్పుడే ఇలాంటి ఆత్మీయ సభలు ఏర్పాటు చేస్తారన్నారు. వెంకటమ్మ గత నలభై సంవత్సరాలుగా ఎందరో విద్యార్థులకు ఆమె చేతి వంట తినిపించడం జరిగిందన్నారు. మండలంలోని ఇందుర్తి గ్రామంలోని వసతిగృహంలో అత్యధిక విద్యార్థులు ఉన్నప్పటికీ వారికి తల్లి ప్రేమను చూపిస్తూ విద్యార్థుల భవిష్యత్తులను తీర్చిదిద్దన్నారు. అనంతరం జడ్పిటిసి గీకురు రవీందర్ తో కలిసి ఎంపీపీ వెంకటమ్మను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వసతి గృహ ఆఫీసర్ ఇతా లియన్, చిగురుమామిడి సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, మాజీ జెడ్పిటిసి అందే స్వామి, ఉప సర్పంచ్ తోట సతీష్, లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదే రఘునాథ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడెం లక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సర్వర్ పాష, హాస్టల్ వార్డెన్లు కిషన్ నాయక్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

**ధర్మపురి జూలై 13 (ప్రజామంటలు):** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న



జిల్లాల్లో జగిత్యాల జిల్లా ఒకటి. జోరున కురుస్తున్న వర్షాలకు ధర్మపురి లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ విస్తృతంగా పర్యటిస్తున్నారు. వర్షాలు, వరదలను లెక్క చేకుండా ధర్మపురి లోని గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు, బురద లోనే పర్యటించారు. మంత్రి ముంపునకు గురైన ప్రజల సమస్యలను తెలుసుకుంటూనే వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అసాధారణ వర్షాల వల్ల జరిగిన నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని మంత్రి కొప్పుల అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు వీలైనంత సహాయం అందిచాలన్నారు. ముంపు ప్రాంత బాధితుల కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

## సమాచార హక్కు పరిరక్షణ సమితి జగిత్యాల జిల్లా అధ్యక్షురాలుగా మేక జమున నియామకం



**జగిత్యాల జూలై 13 (ప్రజామంటలు):** సమాచార హక్కుపరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొమ్మెర బోయిన కేశవులు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు గాజుల నాగరాజు జిల్లా సమాచార హక్కు పరిరక్షణ సమితి అధ్యక్షురాలుగా మేక జమున ని అధ్యక్షురాలుగా నియామక పత్రం జారీ చేశారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని బయటకు తీస్తూ, సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని, తన ఎన్నికకు సహకరించిన వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.

## గురుపౌర్ణమి సందర్భంగా 'గురు స్వామి' ని సత్కరించిన వనగొంది విజయలక్ష్మి




**గుంతకల్లు జూలై 13 (ప్రజామంటలు):** బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం గురుపౌర్ణమి సందర్భంగా గుంతకల్లు బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణ తిలక్ నగర్ లో ఉన్న ఉమామహేశ్వర ఆశ్రమంలో గురు స్వామి వారికి పూలు, పండ్లు, సమర్పించి శాలువాతో సత్కరించి...స్వామి వారి ఆశీర్వచనాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జ్ వనగొంది విజయలక్ష్మి, రాష్ట్ర నమామి గాంగే సభ్యులు షేకన్న, రాష్ట్ర సభ్యత్వ సభ్యులు పురందర్, పట్టణ అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రసాద్, జిల్లా నాయకులు విశ్వనాథ, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం పెంచిన నిత్యావసర ధరలను తగ్గించాలి

**జనగామ జూలై 13 (ప్రజామంటలు):** పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో జనగామ పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి ఆసిఫ్ అధ్యక్షతన వినూత్న నిరసన చేపట్టారు. జనగామ పట్టణంలో స్థానిక చౌరస్తాలో గ్యాస్ సిలిండర్లను ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి, నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బనుక శివరాజ్ యాదవ్ పాల్గొన్ని మాట్లాడుతు గత యూపీఏ ప్రభుత్వంలో రూ.410 రూపాయలు గ్యాస్ సిలిండర్ ధర ఉంటే ఆందోళన చేసిన ప్రస్తుత కేంద్రమంత్రి స్మృతి ఇరానీ ఇప్పుడు రూ. 1105 రూపాయలకు పెంచారన్నారు. రానున్న రోజుల్లో యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంకి వ్యతిరేకంగా అనేక నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనగామ యూత్ కాంగ్రెస్ నాయకులు రామగళ్ళ అభినయ్ కుమార్, కొడిదల అజయ్, వల్లలా రాకేష్, కందుల వెంకటేష్, గుగ్గిల్ల అఖిల్, గ్యార క్రాంతి, పెరిమెల్లి అఖిల్, ముడెనేపల్లి కపిల్, మహమ్మద్ ముబీన్, సుంచు సురేష్, ఇరికి శ్రీకాంత్, బర్ల కిరణ్, గందమల్ల రాకేష్, చింతకింది మహేష్, మొహమ్మద్ గౌస్, రాజు, శ్రీనివాస్, రాజేష్, సందీప్, సురేష్, రఘు పాల్గొన్నారు.



### గౌరవెల్లి నిర్వాసితులకు పథకం ప్రకారం

## బెయిల్ రాకుండా చేస్తున్న ప్రభుత్వం

● పొన్నం ప్రభాకర్

**కరీంనగర్ జూలై 13 (ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణం కోసం తమ సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులు, ప్రాజెక్టు నిర్మాణం కింద ఇల్లు భూములు కోల్పోతున్న వారికి ప్రభుత్వం తరఫున ఇవ్వవలసిన పరిహారం గురించి జూన్ 14న హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టగా, ప్రాజెక్టు ట్రయల్ రన్ అడ్డుకోవద్దంటూ ఎమ్మెల్యే అనుచరులు అధికార తెరాస పార్టీ కార్యకర్తలు ర్యాలీ తీసి నిర్వాసితులను ఉద్దేశించి రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది ఈ పరిస్థితుల్లో పోలీసులు టిఆర్ఎస్ ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు కొంచమైన మానవత్వం లేకుండా కొంతమంది నిర్వాసితులపై కేసులు పెట్టి అదే రోజు జైలుకు తరలించారు. జైలులో ఉన్న బద్దం శంకర్ రెడ్డి, అంగెటి తిరుపతిరెడ్డి, రాగి శ్రీనివాస్, భూక్య సక్రు అనే నలుగురు భూనిర్వాసిత రైతులను రిమాండ్ కు తరలించిన పోలీసులు చేతులకు సంకెళ్లు వేసి వారిని దొంగలు, క్రిమినల్స్, తీవ్రవాదులుగా ఈ సమాజానికి చూపించే ప్రయత్నం చేసి కోర్టులో హాజరు పరిచి అవమానించినారు. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించిన పత్రాలను పోలీసులు కోర్టుకు సమర్పించక పోవడంతో, మరో 14 రోజులపాటు రిమాండ్ పొడిగించి నిర్వాసితులు జైల్లోనే ఉండే విధంగా చేసి, నిర్వాసితులకు బెయిల్ రాకుండా పథకం ప్రకారమే ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. గౌరవెల్లి ప్రాజెక్టు కోసం ఇండ్లు, పొలాలు, చెట్లు చేమ ఇలా అన్ని త్యాగం చేసిన రైతులకు సంకెళ్లు వేసి కోర్టుకు తీసుకురావడాన్ని ప్రతి పౌరుడు ఖండించాలి, తమకు రావలసిన న్యాయమైన పరిహారం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని క్రిమినల్స్ గా దేశద్రోహులుగా చేతులకు బేడీలు వేసి రైతుల పట్ల అమానుషంగా కక్ష పూరితంగా వ్యవహరిస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పాలని, ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి జైలులో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసిత రైతులకు బెయిల్ మంజూరు చేసి విడుదల చేయాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ పక్షాన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము అన్నారు.



### బాయర్ కంపెనీ వయోగో కొత్త ప్రొడక్ట్‌ను

## ప్రారంభించిన చైర్మెన్ నాగుర్ల వేంకటేశ్వర్లు

వరంగల్ శివ నగర్ లోని శ్రీసాయి కన్వెన్షన్ హాల్లో బాయర్ కంపెనీ వారి వయోగో కొత్త ప్రొడక్ట్ ను తెలంగాణ రాష్ట్ర రైతు ఋణ విమోచన కమీషన్ చైర్మెన్ నాగుర్ల వేంకటేశ్వర్లు మరియు బాయర్ కంపెనీ రిజినల్ మెనెజర్ నరేంద్రకుమార్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ కొత్త ప్రోడక్ట్ వరి ఇతర పంటలు లో ఉన్నటువంటి చీడపీడల నివారణకు దీన్ని వాడతారని ఇది అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని తయారు చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో దీని డిమాండ్ పెరుగుతుందని అన్నారు. ఈ కొత్త ప్రోడక్ట్ లాంచింగ్ కార్యక్రమానికి విచ్చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఫర్టిలైజర్స్ మరియు ఫెస్టిసైడ్స్ డీలర్స్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. రానున్న కాలంలో ఈ వయోగో బాగా సేల్ అవుతుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో బాయర్ కంపెనీ వరంగల్ మేనేజర్లు మహంతి, జలీల్ పాషా, బాలకిష్టారెడ్డి, డిస్ట్రిబ్యూటర్లు మధుసుధన్ రెడ్డి, రవీంద్రబాబుతో పాటు సుమారు 300 మంది డీలర్లు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.



## నిరంతర వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే డా. సంజయ్

**జగిత్యాల జూలై 13 (ప్రజామంటలు):** జగిత్యాల పట్టణంలోని కండ్ల పల్లి చెరువు వరద నీటితో పూర్తి స్థాయిలో నీటితో నిండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ బుధవారం కండ్ల పల్లి చెరువు కట్టను పరిశీలించి, కట్టను ఇసుక సంచులతో మాటు వేయాలని, తూములు తెరవాలని, అన్ని విధాల రక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్. మాట్లాడుతూ... లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిరంతర వర్షాల వల్ల చెరువులు, వాగులు, నదులు, నాళాలు పొంగి పొర్లుతున్నాయి అని ప్రజలు తగు జాగ్రత్తలు పాటిస్తూ సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. నిరంతర వర్షాలకు పాత ఇల్లు కూలే అవకాశం ఉన్నందున పాత ఇల్లు ఖాళీ చేసి వెళ్లాలని, అధికారులు సైతం సమాచారం అందజేయాలని అన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ శాఖ సిబ్బంది ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ ఉన్నారని, అంటూ వ్యాధులు కూడా ప్రబలే అవకాశాలు ఉన్నాయని ప్రజలు జాగ్రత్తగా ఉండాలి అని కోరారు. అనుకొని విపత్తు సంభవిస్తే ప్రజలు సహాయక చర్యలకు సైతం సిద్దంగా ఉండాలి అని అన్నారు. వెంట జిల్లా రైతు బంధు సమితి సభ్యులు దామోదర్ రావు, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు దుమాల రాజ్ కుమార్, ఎఫ్‌సిఎస్ అధ్యక్షులు గుమ్ముల అంజయ్య, పట్టణ పార్టీ ఎస్సీ కమిటీ అధ్యక్షులు పవన్, ఇరిగేషన్ ఈఈ ఖాన్, డిటి రాజేందర్ రావు, నదీమ్, యాదగిరి, నాగార్జున, ఎఫ్సిఎస్ డైరెక్టర్ లు, నాయకులు, ప్రజలు, రైతులు తదితరులు ఉన్నారు.



గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షం కారణంగా రెండు రోజులుగా అన్నం లేక ఇబ్బంది పడుతున్న జగిత్యాల కొత్త బస్ స్టాండ్ లో నిరుపేదలకు ఆహారం అందించిన భోగోజు ముకేశ్ ఖన్నా



## నేషనల్ లెవల్ చైల్డ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్ 2022 పోస్టర్లు ఆవిష్కరణ

**జనగామ జూలై 13 (ప్రజామంటలు):** నేషనల్ లెవల్ చైల్డ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్



2022 పోస్టర్‌ను బుధవారం నాడు జనగామ పుల్లయ్య కళానిలయం ఆద్వర్యంలో డి పి అర్ ఓ కలవల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మసురం రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.... జనగామ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 15,16,17 తేదిల్లో ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పాట్ పెయింటింగ్ కాంపిటీషన్స్ ఉంటాయని తెలిపారు. బెంగళూరు చెందిన మనస్వీని, హైదరాబాద్ చెందిన విస్వేత్, జనగామ జిల్లా పెంబర్తి చెందిన జి. నవ్యశ్రీ చిత్రకళ ప్రదర్శన ఎర్పాటు చేశామని వివరించారు. చిత్రలేఖన కళ పై ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ చిత్రప్రదర్శన తిలకిస్తూ ఆదేరోజు స్పాట్ పెయింటింగ్ కాంపిటిషన్‌లో పాల్గొనవచ్చునని రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో కవి,చరిత్ర పరిశోధకులు రెడ్డి రత్నాకర్ రెడ్డి, జరసం అధ్యక్షుడు అయిలా సోమనర్సింహచారి, కవి హృదయం సాహిత్య వేదిక అధ్యక్షుడు పెట్లోజు సోమేశ్వరాచారి, జి. వై. గిరి పౌండేషన్ చైర్మన్ జి. కృష్ణ, పొట్టబత్తిని భాస్కర్, చిలుమోజు సాయికిరణ్, తొలుపునూరి రామచంద్రం, శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు లగిశెట్టి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులుగా ముసిపిస్తున్న ముసురు

### ఇప్పటి వరకు భారీ వర్షం కురియలేదు

**భీమదేవరపల్లి జూలై 13 (ప్రజామంటలు):** ఓ వైపు దేశ వ్యాప్తంగా భారీ వర్షాలతో ముంచేత్తుతుంటే, రాష్ట్రంలో చెరువులు, డ్యాంలు, ప్రాజెక్టులు జలకళతో ఉట్టి పడుతుంటే భేమదేవరపల్లి మండలం మండలంలోని పలు



గ్రామాల్లో చెరువులు, కుంటలు, బావులు వరుణుడి కటాక్షం కొరకు వేచి చూస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అతి భారీ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఇప్పటి వరకు మండలంలో సాధారణ వర్షపాతమే నమోదైంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా గ్రామాల్లో పరిశీలిస్తే గడిచిన మూడు రోజులుగా ముసిపిస్తున్న ముసురు ముసురు గానే ఉంది తప్ప భారీ వర్షాలు ఇప్పటివరకైతే కురియలేదు. ఏ గ్రామంలో కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురే తప్ప భారీ వర్షం కురియలేదు. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వానలకు చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు జలకళతో పొంగి పొర్లుతుండగా మండలంలో మాత్రం గత సం.లో నిండి వున్న నీటితో నిబ్బరంగా వున్నాయి.



జగిత్యాల పట్టణం లోని 30, 31, 43 వార్డుల్లో భారీ వర్షాలకు కూలిన ఇండ్లను పరిశీలించి ఆ ఇంట్లో ఉండే వారిని సురక్షితమైన ప్రదేశాలకు తరలించిన మున్సిపల్ చైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్. వారి వెంట వున్న ముస్లిం కమిటీ అధ్యక్షుడు బారి, నాయకులు రాజకుమారి ముఖీమ్, ఫిరోజ్, రిజ్వాన్

## మానసిక ప్రశాంతత కోసం ఆలయాలు సందర్శించాలి

**జగిత్యాల జూలై 13 (ప్రజామంటలు):** మానసిక ప్రశాంతత కోసం భక్తులు నిత్యం ఆలయాలు సందర్శించాలని 108 శ్రీచక్ర సహిత లలితామాత



ఆలయ ఫౌండరి ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప అన్నారు. జగిత్యాల రూరల్ మండలం పొలాస లో నిర్మితమవుతున్న 108 శ్రీ చక్ర సహిత లలితా మాతా ఆలయ ప్రాంగణంలో బుధవారం ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప ఆధ్వర్యంలో సుహాసినులు మణిద్వీప వర్ణన పారాయణం భక్తి శ్రద్ధలతో చేశారు. గురుపౌర్ణమి సందర్భంగా లలితా మాత స్తోత్ర పారాయణం గావించారు. ఈసందర్భంగా ట్రస్టీ చైర్మన్ స్వరూప మాట్లాడుతూ.... ఆధ్యాత్మికతను పెంపోందించి సమాజంలో భక్తిభవాన్ని అలవర్చుడానికి మహిళలను జాగృతం చేస్తున్నామని తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ప్రతి బుధవారం లలితామాత పారాయణం మహిళలచే నిర్వహిస్తున్నామని అన్నారు. అకాల వర్షాల వల్ల ప్రజలు అప్రమాత్తంగా ఉండాలని స్వరూప సూచించారు. మానసిక, శారీరక ప్రశాంతత కోసం ప్రతిరోజు భక్తులు ఆలయాలు సందర్శించాలని స్వరూప కోరారు. కార్యక్రమంలో ఉటూరి అర్చన, మహేందర్, ఉటూరి కళ్యాణి, జిడిగే వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీలో కాటరాక్ట్ సర్జరీలకై స్పెషల్ వార్డు

**నేత్ర వ్యాధి బాధితులకు 20 బెడ్ల కేటాయింపు**

**సూపరింటెండెంట్ డా. రాజారావు**

**సికింద్రాబాద్ జులై 13 ( ప్రజామంటలు):** గాంధీ ఆసుపత్రిలో కంటి




వ్యాధుల పేషంట్ల కోసం 20 బెడ్లతో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాజారావు తెలిపారు. కంటి ఆపరేషన్లు ( కాటరాక్ట్) చేయడానికి నిపుణులైన వైద్య బృందం సిద్ధంగా ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, నేత్ర సంబందిత సమస్యలున్నవారు నేరుగా గాంధీ ఓపీకి వచ్చి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి కాటరాక్ట్ సర్జరీలు చేస్తామని చెప్పారు.

## ఆటా పాటే కాదు.... చేపలు కూడా పడుతా

**వల విసిరి... చేపలు పట్టిన ఎమ్మెల్యే రసమయి.**

**మానకొండూర్ జులై 12 (ప్రజామంటలు):** మానకొండూర్ మండలంలో ఉదయం తన తొలిపొద్దు కార్యక్రమాన్ని ముగించుకొని క్యాంపు



కార్యాలయానికి తన కారులో బయలుదేరిన రాష్ట్ర సాంస్కృతిక సారథి ఛైర్మెన్, మానకొండూర్ శాసనసభ్యులు డా. రసమయి బాలకిషన్ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలోని పెద్ద చెరువు పూర్తిగా నిండి మత్తడి దూకుతుందన్న తరుణంలో స్థానిక మత్యకారులు చేపలు పట్టడాన్ని గమనించి ఆటా పాటే కాదు చేపలు కూడా పడుతా అంటూ ఎమ్మెల్యే రసమయి వల విసిరి చేపలు పట్టి అందరి ఆశ్చర్యంలో ముంచెత్తారు. ఆయన కొద్దిసేపు మత్యా కారుడిగా మారి చెరువులో వల విసరగా అందులో పెద్ద పెద్ద చేపలు చిక్కుకున్నాయి. ఒక ఎమ్మెల్యే హెూదాలో ఉన్న రసమయి సారు దాదాపు అరగంట పాటు మాతో సరదాగా చేపలు పట్టడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు ముదిరాజులు.

## ఆచూకీ దొరకని ఎన్ టీవీ రిపోర్టర్ జమీర్, కొట్టుకుపోయిన కారు

**ప్రాణాలతో బయటపడ్డ కారులో ప్రయాణిస్తున్న ఇర్షాద్**

**సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే**

**రాయికల్ జూలై 13 (ప్రజామంటలు):** రాయికల్ మండలంలోని రామాజీపేట భూపతిపూర్ గ్రామం మధ్యలో ఉన్న వాగులో నిన్న రాత్రి



ఎన్ టీవీ రిపోర్టర్ జమీర్ కారు గల్లంతైంది ఇదే కారులో ప్రయాణిస్తున్న ఇర్షాద్ అనే వ్యక్తి కొట్టుకపోయి కొంత దూరం వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు తెల్లవారుజామున రెండు గంటల వరకు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు అలాగే గజ ఈతగాళ్లను, క్రేన్ల సహాయంతో వెతికినా కూడా ఆచూకీ కనబడలేరు. ఈ సంఘటన స్థలాన్ని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తహసీల్దార్ దిలీప్ నాయక్ మున్సిపల్ కమిషనర్ సంతోష్ ఆయా గ్రామాల సర్పంచ్ లు, కార్యదర్శులు, అధికారులు సందర్శించారు.

## తాటిచెట్టు పడడంతో కూలిపోయిన ఇల్లు

**పరామర్శించిన ఎమ్మెల్యే ఆరూరి**

**హసన్ పర్తి జూలై 13 (ప్రజామంటలు):** గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ దేవన్నపటలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు శిగ రజిత ఇంటి పై తాటి చెట్టు కూలడంతో వారిని పరామర్శించి ఆర్థిక సహాయం



అందజేసిన తెరాస వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యారాణి రాజు నాయక్, ఎమ్మార్వో నాగేశ్వరరావు, అంచూరి విజయ్ కుమార్, రవి, భూపాల్ గౌడ్ స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పునరావాస కేంద్రం సద్వినియోగం చేసుకోవాలి

**● చైర్ పర్సన్ ఆకుల రజిత**

**హుస్నాబాద్ జులై 13 (ప్రజామంటలు):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా పట్టణ, పరిసర ప్రాంతాలలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో, గుడిసెలలో నివసిస్తున్న వారు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత కోరారు. పునరావాస కేంద్రంలో ఉన్న నాలుగు కుటుంబాలను మున్సిపల్ పాలకవర్గం, కౌన్సిలర్లతో కలిసి సందర్శించి వారికి భరోసా కల్పించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను, గుడిసెలను వర్షం తగ్గిన తర్వాత తిరిగి వెళ్లి సరి చేసుకోవచ్చని అంతకంటే ముందు వారి ప్రాణాలు ముఖ్యం కాబట్టి అలాంటి ఇండ్లలో ఉన్నవారు పునరావాస కేంద్రానికి రావాలని పలు నాయకులు మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బోజు రవీందర్, కొంకటి నలిని దేవి, బిజెపి నాయకులు కవ్వ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కూలిపోయిన ఇండ్లను పరిశీలించి, భరోసా అందించిన ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి

**చిగురుమామిడి జూలై 13 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలంలో గత 6 రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కూలిన ఇండ్లను పీచుపల్లి గ్రామంలో బుధవారం రోజున చిగురుమామిడి మండల ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో 27 ఇండ్లు కూలీపోయాయని వారు తెలిపారు. ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఆదేశానుసారం వారిని ఆదుకుంటామని, అధికారులు ఎప్పటికప్పుడు రిపోర్ట్ అందచేస్తున్నారని ఎంపీపీ కొత్త వినీత శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.గౌరవ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, అవాంఛనీయ సంఘటనలు కానీ, అత్యవసర పరిస్థితులు ఉంటే వెంటనే ప్రజాప్రతినిధులకు గాని, అధికారులకు కానీ వెంటనే సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గారితో పాటు సర్పంచ్ పీచు లీల,పెసరి జమున, పీచుపల్లి గ్రామశాఖ అధ్యక్షులు యాళ్ల జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జగిత్యాల ధర్మసముద్రంకు పడిన గండి

**● 11వ వార్డు యువత తో కలిసి ఇసుక బస్తాలు వేసిన మున్సిపల్ సిబ్బంది**

**జగిత్యాల జూలై 13 (ప్రజామంటలు):** స్థానిక 11వ వార్డుల్లో ధర్మసముద్రం చెరువు నిండి గండి పడిన సంగతిని తెలుసుకొని స్థానిక అమీనాబాద్ యువకులు 50 మంది మున్సిపల్ సిబ్బంది తో కలిసి గండి కి ఇసుక సంచులు వేసి లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు విషయం తెలుసుకున్న జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్ అక్కడికి వెళ్లి గండి పడిన ప్రాంతంలో పరిశీలించారు. వారి వెంట తెరాస పట్టణ ఉపాధ్యక్షుడు ఆనంద్ రావు, నాయకులు బాల శంకర్, రహీం, ఫరూక్ మరియు యువత ఉన్నారు.



## చిలకలగూడ ఆలయంలో కాంగ్రెస్ నేతలు

**సికింద్రాబాద్ జులై 13 (ప్రజామంటలు):** గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని చిలకలగూడ సాయిబాబా ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈసందర్భంగా రాష్ట్ర టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దాడిగా సందీప్ రాజు, అడ్డగుట్ట కాంగ్రెస్ డివిజన్ అద్యక్షుడు గంట రాజు సాగర్ లు బాబాను దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అనంత కృష్ణారావు, లీగల్ నవీన్, సీనియర్ నాయకుడు రవిశంకర్, ఎస్సీ సెల్ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ కన్వీనర్ భూపతి హరి, యువజన నాయకుడు బంటి, బాలు, శీను తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**● వైస్ ఎంపీపీ పిసరి భూమయ్య**

**రుద్రంగి జూలై 13 (ప్రజామంటలు):** తుపాను ప్రభావంతో ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైస్ ఎంపీపీ పిసరి భూమయ్య పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో శంకర్ నాయక్,వైస్ ఎంపీపీ భూమయ్య కలిసి మానాల గ్రామ శివారులోని తాతమ్మ ఒర్రె కల్వర్టు వద్ద పైనుంచి వస్తున్నా నీటి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం ఒర్రె వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ భూమయ్య మాట్లాడుతూ.... గ్రామములోని కోమటి చెరువు,పెద్ద చెరువులు నిండి వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని అన్నారు. నీటి ప్రవాహాల వద్దకు ప్రజలు వెళ్లకూడదని పాత ఇండ్లు. ఏదైనా నష్టం జరుగుతే తెలుపలని అన్నారు. రుద్రంగి,భీంగల్ వైపు వెళ్లే ప్రయాణికులు తండా నుంచి వెళ్లే రింగ్ రోడ్డు మార్గాన వెళ్లాలని తెలిపారు. వీరి వెంట ఎంపీఓ సుధాకర్, టిఏ ధనుంజయ్, జక్కు మోహన్ తదితరులు ఉన్నారు.



## దళిత బంధు ద్వారా మంజూరైన నిధులతో టెంట్ హౌజ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే సాయన్న

**కంటోన్మెంట్ 13 జూలై (ప్రజామంటలు):** తెలంగాణ ఉద్యమకారుడు టీఆర్ఎస్ నేత అందే శ్రీనివాస్ పార్టీకి వెన్నుదన్నుగా ఉంటు పార్టీ ఏలాంటి కార్యక్రమాలు నిర్వహించన ముందుండే వ్యక్తి అతనికి



దళిత బంధూ పథకం వరించింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే జి.సాయన్న అందే శ్రీనివాస్ అందిస్తున్న సేవలు అభినందిస్తు దళిత బంధూ పథకం ద్వారా మంజూరైన టెంట్ హౌస్ ను బుధవారం ప్రారంభించారు. కంటోన్మెంట్ లోని 8వ వార్డు బొల్లారం లో ఏర్పాటు చేసిన టెంట్ హౌస్ ఎమ్మెల్యే సాయన్న ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించగా స్థానిక మాజీ బోర్డు సభ్యులు లోకనాధం, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత టీఆర్ఎస్ శ్రేణులు కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

## శ్రీ ఉజ్జయిని మహంకాళి జాతర

**గోడ పత్రికను ఆవిష్కరించిన మంత్రి తలసాని**

**సికింద్రాబాద్ 13 జూలై (ప్రజామంటలు):** పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెస్ట్ మారేడ్ పల్లి లోని



తన నివాసం వద్ద ఈ నెల 17 న నిర్వహించే ఉజ్జయిని మహంకాళి అమ్మవారి జాతర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ డిపార్ట్మెంట్ అధికారి రీజినల్ జాయింట్ కమిషనర్ రామ కృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ బాలాజీ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



రఘునాథపల్లి మండలానికి చెందిన గోళ్ళ సాయి కుమార్ గౌడ్ రెండో కుమారుడు విగ్నేష్ పుట్టినరోజు వేడుకలో పాల్గొన్న జనగామ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆరుట్ల దశమంత రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉడుగుల రమేష్, కెవిఎల్ఎన్ రెడ్డి



తకళ్ళపెల్లి గ్రామంలో శితిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నివాసం కల్పించేందుకు సర్పంచ్ మొలిగె లక్ష్మి శ్రీనివాస్ ముందస్తుగా ఏర్పాట్లు చేశారు. ఉదకమ్మ చెరువు వర్షపు నీటికి పూర్తిగా నిండడంతో జేసిబి సహాయంతో చెరువు మత్తడి వద్ద తాత్కాలిక చర్యలు చేపట్టారు.



గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా సికింద్రాబాద్, అమీర్ పేట హనుమాన్ దేవాలయంలో షిర్డీ సాయిబాబా కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు షిర్డీబాబా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు బాబాను దర్శించుకొని బాబా ప్రసాదంగా అక్కడి అన్నదానం లో పాల్గొని భోజనం చేశారు.



జగిత్యాల పట్టణంలోని కండ్లపెల్లి చెరువు నిండగా సలిమా గార్డెన్ చుట్టు పక్కల లోతట్టు ప్రాంతల వారిని దగ్గర్లో ఉన్న షాధిఖానా కు స్థానిక యువకుల సహాయంతో తరలించగా, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ డా. భోగ శ్రావణి ప్రవీణ్

## మానవత్వం చాటుకున్న పెగడపల్లి ఎస్.ఐ. శ్వేత

**గర్భిణీ మహిళను పోలీసు వాహనంలో తరలింపు**



**జగిత్యాల జూలై 13 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని ఐతుపల్లి గ్రామంకి చెందిన పలుమారు రమ పురిటి నొప్పులతో బాధపడుతూ వరదల వల్ల ఆసుపత్రికి వెళ్ళలేక 100 కి కాల్ చేయగా, వెంటనే స్పందించిన ఎస్సై శ్వేత తమ పోలీసు వాహనంలో ఆసుపత్రికి తరలించారు. దీనికి వారి కుటుంసభ్యులు ఎస్సై కు కృత్ఞతలు తెలిపారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com